ప్రజాశక్తి

గురువారం 6 నవంబర్ 2025   8 పేజీలు



గుంటూరు



పల్నాడు



పత్తి కొనుగోలుకు ఆంక్షలు..

జిల్లాలో 30 కేంద్రాలు ఏర్పాటు
12 శాతం తేమ దాటితే తిరస్కరణ?



ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పత్తి కొనుగోలుకు ప్రారంభమైంది. ఆంక్షలు యథాతథంగా కొనసాగనున్నాయి. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పత్తి దిగుబడి తక్కువగా ఉందని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆంక్షలు అమలు చేయడంపై రైతులు అసంతృప్తిగా ఉన్నారు. ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవడంతో పాటు రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలి. సిఎం యాప్‌లో పేర్లు నమోదు చేశాక సమీపంలోని కొనుగోలు కేంద్రంగా ఉన్న జిన్నింగ్ మిల్లులకు వెళ్లాల్సి ఉంది.

2024-2025లో కనీస మద్దతు ధర రూ.7521 ఉండగా ▶ 2లో

యువతి ఆత్మహత్య.. యువకుడు గల్లంతు..

ప్రజాశక్తి - తెనాలి



షేక్ మస్రూన్, ఖాజా (ఫైల్ ఫొటోలు)

మండలంలోని కొలకలూరులో విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన యువతి ఆత్మహత్య చేసుకోగా, యువకుడు కాల్వలో గల్లంతయ్యాడు. వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన షేక్ మస్రూన్ (20) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈమె బాపట్లలో ఇంజినీరింగ్ చదువుతున్నట్లుగా కుటుంబీకులు చెబుతున్నారు. యువతి ఆత్మహత్య విషయం తెలిసిన అదే ప్రాంతానికి చెందిన యువకుడు కాజా గ్రామంలోని కొమ్మమూరు కాల్వలో దూకి గల్లంతయ్యాడు. కాజా కూడా బాపట్లలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. యువతీ యువకుల మధ్య ప్రేమ విషయమై ఏర్పడిన స్పర్థలే ఘటనకు కారణమని సమాచారం. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఇద్దరి ఫొటోలు చూసిన యువతి కుటుంబీకులు మందలించినట్లు సమాచారం. అయితే ఈ రెండూ వేర్వేరు ఘటనలుగా స్థానికులు చెబుతున్నారు.

రేపు లాం, పెదకాకానికి సిఎం చంద్రబాబు రాక



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : తాడికొండ మండలం లాం గ్రామంలోని ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయానికి సిఎం చంద్రబాబు శుక్రవారం రానున్నారు. ఆచార్య ఎన్.జి.రంగా ట్రస్టు ఆధ్వర్యంలో ఆచార్య ఎన్.జి.రంగా 125వ జయంతి ఉత్సవాలకు సిఎం హాజరు కానున్న దృష్ట్యా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్‌పి వకుల్ జిందాల్ బుధవారం పరిశీలించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఆడిటోరియం హాలును పరిశీలించి, హాలు సామర్థ్యం, వేదిక అమరికలు, విఐపిల రాకపోకల మార్గాలు, ప్రజలు వచ్చివెళ్లే మార్గాలను పరిశీలించి అధికారులతో సమీక్షించారు. పెదకాకాని శంకర్ కంటి ఆస్పత్రి వద్ద నిర్మించిన భవనాలను సిఎం శుక్రవారమే ప్రారంభించనున్న దృష్ట్యా అక్కడ ఏర్పాట్లనూ జిల్లా అధికారులు పరిశీలించి ఆస్పత్రి నిర్వాహకులతో మాట్లాడారు.

భోజనం నాణ్యత లేమిపై ఎస్ఆర్ఎం విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి



రాజధాని అమరావతిలోని నీరుకొండ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో నాణ్యమైన ఆహారం లభించక కొన్ని రోజులుగా వందలాది మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. విశ్వవిద్యాలయం అధికారుల తీరుకు నిరసనగా బుధవారం రాత్రి వర్సిటీ ప్రాంగణంలో ధర్నా చేశారు. గత నెల 29 నుంచి ప్రతిరోజూ కొంత మంది విద్యార్థులు ఆహారం సరిగా లేక అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. తూతూ మంత్రం చర్యలతో కాలయాపన చేశారు. బుధవారం ఈ ఘటన ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో విశ్వవిద్యాలయం అధికారులు స్పందించారు. అంతేగాక 300 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు మీడియాలో ప్రచారం జరగడంతో జిల్లా అధికారులు కూడా విశ్వవిద్యాలయంలో ఆరాతీశారు. పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులూ వర్సిటీకి వచ్చారు. తల్లిదండ్రులతో చర్చల నేపథ్యంలో విద్యార్థులు విశ్వవిద్యాలయం హాస్టల్ గదుల నుంచి బయటకు వచ్చి నిరసన ప్రదర్శన చేశారు. దీంతో అధికారులు దిగి వచ్చి మెనూ ప్రకారం భోజనం, అల్పాలహారం ఇస్తామని హామీ ఇవ్వడంతో రాత్రి 10 గంటల ప్రాంతంలో ఆందోళన విరమించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి తనిఖీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో చేపట్టిన తనిఖీల్లో భాగంగా నరసరావుపేట పట్టణం ప్రకాష్‌నగర్‌లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఉదయం 11 గంటలకు కార్యాలయానికి వచ్చిన ఎసిబి అధికారులు లోపలికి వెళ్లి తాళాలు వేశారు. రాత్రి 8 గంటల వరకూ గుంటూరు రేంజ్ అడిషనల్ ఎస్‌పి మహేంద్ర మాతే ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగాయి. పలు ఫైళ్లను పరిశీలించారు. కార్యాలయాలు, సిబ్బంది చేతివాటంపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు మహేంద్రా మాతే తెలిపారు. ఫైళ్ల తనిఖీతోపాటు సిబ్బందిని, డాక్యుమెంట్ రైటర్లనూ విచారణ చేస్తున్నామన్నారు. తనిఖీలు పూర్తయ్యాక సమగ్ర వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా తనిఖీల సందర్భంలో లెక్కలు లేవనే కారణంతో రూ.35 వేలను అధికారులు తొలుత స్వాధీనం చేసుకున్నారు. అయితే అప్పటికే రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారి డబ్బుగా అనంతరం నిర్ధారించుకున్నారని తెలిసింది. ఇదిలా ఉండగా ఎసిబి అధికారులు తనిఖీలకు వచ్చారనే సమాచారంతో కార్యాలయం వద్ద ఉన్న నోటరీ, డాక్యుమెంట్ రైటర్లంతా అక్కడి నుండి వెళ్లిపోయారు.

ఎయిమ్స్ కార్మికుల విజయం

తిరిగి విధుల్లోకి తీసుకుంటామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని కాంట్రాక్టర్ హామీ

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి ఎయిమ్స్‌లో పనిచేస్తున్న గార్డెనింగ్ కార్మికులను ఈ నెల నుండి తొలగించగా వారు మంగళగిరి ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు ఉద్యమించారు. దీంతో బుధవారం సాయంత్రం సిఐటియు నాయకులతో కాంట్రాక్టర్ చర్చించారు. తొలగించిన కార్మికులను పనిలోకి తీసుకుంటామని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పిస్తామని, రూ.వెయ్యి వేతనం పెంచుతామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనను విరమించినట్లు సిఐటియు జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య తెలిపారు. గురువారం నుండి కార్మికులు పనిలోకి వెళ్తారని చెప్పారు. చర్చల్లో యూనియన్ నాయకులు సుధాకర్, ఎ.రవికుమార్, గార్డెనింగ్ కార్మికుల యూనియన్ నాయకులు ఏసురత్నం, నవీన్, ప్రసన్న, ఎస్తేర్ రాణి పాల్గొన్నారు.

తెనాలిలో భారీ చోరీ..!

- దోపిడీ సొత్తు విలువ రూ.65 లక్షలు పైనే
- ఇంటి దొంగల పనిగా భావిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో భారీచోరీ సంచలనం రేకెత్తించింది. దాదాపు రూ.65 లక్షల సొత్తు చోరీకి గురైంది. తెనాలి ప్రాంతంలో ఈ మధ్యకాలంలో ఇదే అతి భారీ చోరీగా చెప్పవచ్చు. రైల్వే స్టేషన్ రోడ్డు కావడం, బస్టాండ్‌కు అతి సమీపంలో ఉండటంతో ప్రయాణికుల రాకపోకలతో అర్ధరాత్రి సమయంలో సైతం ఈ ప్రాంతంలో జనసంచారం ఉంటుంది. అలాంటి ప్రాంతంలో భారీచోరీ పట్టణంలో తీవ్ర చర్చనీయాంశమైంది. పైగా దొంగతనం జరిగినట్లు మూడో తేది రాత్రే బాధితులు గుర్తించినా, 4వ తేది అర్ధరాత్రి 12 గంటల వరకూ పోలీసులు విషయం బయటకు పొక్కనీయలేదు. త్రీ టౌన్ సిఐ ఎస్ సాంబశివరావు వెల్లడించిన వివరాల ప్రకారం...

స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో ఓ ప్రైవేట్ వైద్యశాల



చోరీ జరిగిన ఆస్పత్రి భవనంపైన ఉన్న ఇల్లు

ఉంది. ఆ వైద్యశాలను నిర్వహించే వైద్యులు ఆసుపత్రి భవనం పై అంతస్తులో నివాసం ఉంటారు. ఈనెల ఒకటిన వారు గుంటూరులోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి మూడవ తేది ▶ 2లో

సింగపూర్ కంపెనీ కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

సింగపూర్‌కు చెందిన ఎవర్‌సెండై గ్రూప్ కంపెనీ ఏర్పాటు కోసం 50 ఎకరాల కేటాయింపుపై నియోజకవర్గ కేంద్రానికి సమీపంలోని మల్లాయపాలెం గ్రామంలో స్థలాన్ని అధికారులు బుధవారం పరిశీలించారు. స్టీల్ ఫ్యాబ్రికేషన్ రంగంలో ఉత్పత్తిదారైన ఈ కంపెనీ రూ.వెయ్యికోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో మల్లాయపాలెం గ్రామంలోని సర్వేనెంబర్ 232 (వక్ఫ్ స్థలం) 233 ఎకరాలను ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్మెంట్ బోర్డ్ వైస్‌ప్రెసిడెంట్ శ్రీహర్ష చిల్లా, కంపెనీ ఎమ్‌డి నందన్, తహశీల్దార్ సుజాత పరిశీలించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ దినకర్, విఆర్ఒ, గ్రామ సర్వేయర్ పాల్గొన్నారు.

వర్సిటీ దూరవిద్య యూజీ, పీజీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో ఈ ఏడాది జూలై, ఆగస్టు మాసాలలో జరిగిన పలు యూజీ, పీజీ కోర్సుల పరీక్ష ఫలితాలను దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, పరీక్షల విభాగ కోఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్ విడుదల చేశారు. బిబిఎం, బిహెచ్‌ఎం, బి బి ఏ, ఇయర్ ఎండ్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాలతో పాటు, ఎంఏ ఇంగ్లీష్, ఎంఏ సోషల్ వర్క్, మొదటి, ద్వితీయ, తతీయ సెమిస్టర్, ఎంఏ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ మూడో సెమిస్టర్, ఎంఏ సోషియాలజీ మొదటినుండి నాలుగు సెమిస్టర్లు, ఎమ్మెస్సీ ఫిజిక్స్, స్టాటిస్టిక్స్ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఈనెల 18వ తేదీలోగా రీవాల్యుయేషన్కు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. యూజీ కోర్సులకు ప్రతి పేపర్ కు రూ. 770 చొప్పున, పీజీ కోర్సులకు ప్రతి పేపర్ కు రూ. 960 చొప్పున ఫీజు చెల్లించాలని వెల్లడించారు. పూర్తి వివరాలను వర్సిటీ వెబ్సైట్ నుండి పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో పరీక్షల విభాగ డిప్యూటీ రిజిస్ట్రార్ జైనలుద్దీన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ లు కష్ణవేణి, కోదండపాణి, సూపరింటెంట్ టంకశాల వెంకటేశ్వర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో కార్తీకపౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక నల్లపాడు రోడ్డులోని రాజరాజేశ్వరి సమేత పుష్పాద్రి ఆకాశమల్లేశరస్వామి దేవాల యంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం విశేష అభిషేకాలు, సాయంత్రం సహస్ర దీపాలం కరణ సేవా, జ్వాలాతోరణం నిర్వహించారు. అదే విధంగా ఈనెల 9న దేవాలయ ప్రాంగణములో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతములు, ఆరుద్ర నక్షత్రము నందర్భ ముగా శ్రీ ఆకాశ మల్లేశ్వర స్వామికి అన్నాభిషేకము, 16న ఉదయం 7 గంటలకు ఆకాశ మల్లేశ్వర స్వామికి లక్ష బిల్వార్చ, 18న దేవాలయ ప్రాంగణములో కోటి దీపోత్సవము, 19న ఆకాశ మల్లేశ్వర స్వామికి విశేష అభిషేకములు, సాయంత్రం 6 గంటలకు నందీశ్వర స్వామికి విశేష అభిషేకము, 20న రాజరాజేశ్వరి అమ్మ వారికి అభిషేకము నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి తెలిపింది.

ఉచిత త్రీ వీలర్‌కు దివ్యాంగులు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - వినుకొండ

అర్హులైన దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం ఉచితంగా త్రీ వీలర్ మోటార్ సైకిళ్లను అందజేస్తుందనీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు కోరారు. www.apdas-cac.ap.gov.in వెబ్‌సైట్లో ఈనెల 25 లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దివ్యాంగులు ఇబ్బంది పడకుండా వినుకొండ నియోజకవర్గంలోని అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా చీఫ్ విప్ కార్యాలయంలో ఆన్లైన్ దరఖాస్తు చేస్తారనీ, అందుకు ప్రత్యేకంగా కార్యాలయంలో సిబ్బందిని కేటాయించి నట్లు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి, రెగ్యులర్ డిగ్రీ, ఆపై ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు, పదోతరగతి ఉత్తీర్ణులై స్వయం ఉపాధితో జీవించే దివ్యాంగులు 18 నుండి 45 ఏళ్ల లోపు 70 శాతం అంగవైకల్యం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విద్యార్హత సర్టిఫికెట్, సదరం సర్టిఫికెట్, రేషన్, ఆధార్ కార్డులతో దివ్యాంగు లు చీఫ్ విప్ కార్యాలయంలో సిబ్బందిని సంప్రదిం చాలని చెప్పారు.

పుష్కర కాలనీలో కొలతలు

ఆందోళనలో పేదలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని పోల్కంపాడు పుష్కర్ కాలనీలో రెవెన్యూ అధికారులు ఇటీవల పేదల ఇళ్లకు కొలతలు వేస్తున్నారు. ఎందుకు కొలతలు వేస్తున్నారో అర్థం కాక పేదలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎందుకోసం ఆన్లైన్ ఖర్చులు అంటూ రెవెన్యూ సిబ్బంది రూ 100 వసూలు చేస్తున్నారని స్థానికులు సిపిఎం నాయకులు దృష్టికి తీసుకువచ్చారు. తీసుకునే వంద రూపాయలు డిమాండ్‌గా వసూలు చేస్తున్నారని పేదలు చెబుతున్నారు. 10 సంవత్సరాల క్రితం వచ్చిన కృష్ణా పుష్కరాలు సందర్భంగా సీతానగరంలో ఉన్న పేదల ఇళ్లను తొలగించి, తాత్కాలిక స్థలాలు పేరుతో ప్రస్తుతం నివాసం ఉంటున్న గుంటూరు ఛానల్ దగ్గర45 గజాల చొప్పున 167 మందికి స్థలాలు కేటాయించారు. తమ శక్తి మేరకు పేదలు ఆ స్థలాల్లోనే ఇల్లు వేసుకుని నివాసం ఉంటున్నారు. ఇప్పుడు అధికారులు కొలతలు పేరుతో తమ ఇంటి స్థలాలను కొలతలు వేయడంతో పేదల ఆందోళన చెందుతున్నారు.

మద్దతు ధరకు పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

పలు గ్రామాల్లో పర్యటించిన జిల్లాకలెక్టర్

ప్రజాశక్తి - ఫిరంగిపురం

జిల్లాలో సిసిఐ ద్వారా మద్దతు ధరకు రైతుల నుండి పత్తి కొనుగోలు సజావుగా కొనసాగేలా అన్ని ముందస్తు ఏర్పాట్లను పగడ్బందీగా చేపట్టామని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. బుధవారం ఫిరంగిపురంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సిసిఐ కేంద్రాల్లో మద్దతు ధరకు పత్తి కొనుగోలుపై ఫిరంగిపురం, మేడికొండూరు మండలాల్లోని పత్తి రైతులకు వ్యవపసాయ సహాయకులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు జిల్లాలో 25వేల హెక్టార్లలో 70800 మంది రైతులు పత్తిని సాగు చేయడం జరిగిందన్నారు. ఒక్క ఫిరంగిపురం మండలంలోనే 5వేల హెక్టార్లు పత్తిసాగుచేశారని తెలిపారు. సిసిఐ ద్వారా మద్దత ధరకు పత్తి కొనుగోలుకు నాలుగు కేంద్రాల్లో 12 జిన్నింగ్ మిల్లులు మ్యాపింగ్ చేశామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో మాదిరి సిఎం యాప్‌లో రైతులు వివరాలు నమోదు చేయాలన్నారు. సిసిఐ వారి కపాస్ కిసాన్ యాప్‌లో రైతులు పత్తి కొనుగోలు కేందవ్రాలకు తీసుకువెళ్లే స్లాట్ తేదీ నమోదు చేసుకోవాలన్నారు. అనివార్య కారణాల వల్ల నమోదు ను రైతులు రద్దు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం రేపూడి గ్రామంలో రక్షిత మంచినీటి పథకం సందర్శించిన సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ఆర్‌డిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ ప్రసాదరావు,సిసిఐ అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న గ్రామస్తులు

తెనాలిలో భారీ చోరీ..!

(మొదటి పేజీ తరువాయి)

రాత్రికి ఇల్లు చేరారు. యథాలాపంగా సేఫ్టీ లాకర్ తాళాలు తెరిచి చూడగా అందులో ఉండాల్సిన ఐదు బంగారపు బిస్కెట్లు, రూ.5.50 లక్షల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి, 4వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం రప్పించారు. ఆధారాలు సేకరించారు. బంగారం మొత్తం 500 గ్రాములు ఉంటుం దని, రూ.5.50 లక్షల నగదుతో కలిపి సుమారు చోరీ సొత్తు విలువ రూ.65 లక్షలు ఉండవచ్చునని పోలీసులు అంచనాకు వచ్చారు. అయితే సేఫ్టీ లాకర్, అందులో నగదు, బంగారం ఉన్న విషయం కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉన్న వ్యక్తులకే తెలిసే అవకాశం ఉంది. ఆ కోణంలోనే పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. సీసీటీవీ ఫుటేజీని కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. డిఎస్‌పి సారథ్యంలో విచారణ చురుగ్గా సాగుతోందని, సాధ్యమైనంత త్వరగా కేసును ఛేదిస్తామని సిఐ చెప్పారు.

పత్తి కొనుగోలుకు ఆంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడాది రూ.8110గా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) నిర్ణయించింది. 2025-26 సీజన్‌లో పత్తి కొనుగోలు కోసం 30 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు సిసిఐ గుంటూరు బ్రాంచి అధికారులు బుధవారం వెల్లడించారు. తేమ శాతం 8 శాతం మించకపోతే రైతులకు పూర్తి స్థాయిలో కనీస మద్ధతు ధర వస్తుందని అధికారులు తెలిపారు. 8 నుంచి 12 శాతం వరకు ఉంటే కనీస మద్ధతు తక్కువ వస్తుందంటున్నారు. పత్తిని రైతులు ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. గరిష్టంగా 12 శాతం కంటే ఎక్కువ తేమశాతం ఉంటే కొనుగోలుకు జాప్యమవుతుందని, లేదా తిరస్కరణకు గురవుతుందనే అంశాన్ని తెరపైకి తెచ్చారు. మార్కెట్ యార్డులతో పాటు పలు జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా ఎంపిక చేశారు. అయితే 15 నుంచి 18 శాతం వరకు తేమశాతం ఉన్నా అనుమతించాలని రైతులు కోరుతున్నారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా ఉండటం, చలి ప్రారంభం కావడం వల్ల పత్తిలో తేమ శాతం పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. అంతేగాక ఆరబెట్టుకునేందుకు రైతులందరికి తగిన స్థలం లేదని రైతులు తెలిపారు.

పల్నాడు జిల్లాలో 2.26 లక్షల ఎకరాలు, గుంటూరు జిల్లాలో 60 వేల ఎకరాలలో ఈ ఏడాది పత్తి సాగు చేశారు. గతేడాది కంటే ఈ ఏడాది రెండు జిల్లాల్లో కలిపి 70 వేల ఎకరాల్లో తక్కువగానే పత్తి సాగైంది. మొన్నటి వరకూ దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నా ఇటీవల సంభవించిన మొంథా తుపాను రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. తీయడానికి సిద్ధంగా ఉన్న పత్తి తడిసి నేలరాలిపోయింది. కొన్నిచోట్ల కాయ, పిందే, పూత తడిసి దిగుబడిని దెబ్బతీసింది. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో మొదటి విడత పత్తి తీయడం ప్రారంభమైంది. తుపాను తొలగిపోయిన తర్వాత ఎండ తీవ్రత వచ్చి నాణ్యతగా ఉన్న ప్రాంతాల్లో తీయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. కనీస మద్ధతు ధర పూర్తి స్థాయిలో లభిస్తే తమకు కొంత వరకు మేలు జరుగుతుందని రైతులు భావిస్తున్నారు.

సాలూరి సంగీతం అజరామరం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెలుగు శ్రోతలకు తరతరాలు గుర్తుండేలా సంగీతాన్ని అందించిన సినీ సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వరరావు సంగీతం అజరామరమని శ్రీ నరేంద్ర రామానుజ దాస స్వామి అన్నారు. మారుమూల గ్రామం సాలూరులో జన్మించి చలనచిత్ర సంగీతంలో తనదైన ముద్రవేసిన సాలూరి మజిలీ మరువలేనిదని సభాధ్యక్షులు, తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటీ ఛైర్మెన్ డాక్టర్ రావిపాటి వీర నారాయణ అన్నారు. స్థానిక కొత్తపేట తెనాలి రామకృష్ణ కవి కళా క్షేత్రంలో సాలూరి 103వ జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెనాలి శ్రీ శరణాగతి గోష్ఠి ట్రస్ట్ శ్రీ నరేంద్ర రామానుజ దాస స్వామి, సాలూరి రాజేశ్వరరావు కుమారుడు సాలూరి వాసురావు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. వర్ధమాన గాయకులు శ్రీ సౌమ్య, కళ్యాణి, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, నీలాంబరం, సాహితీ తదితరులు సాలూరి సంగీత దర్శకత్వం వహించిన గేయాలను ఆలపించి ప్రేక్షకులని అలరించారు. అనంతరం ప్రముఖ సిని వర్ధమాన నేపథ్య గాయని సాహితీ చాగంటికి సాలూరి రాజేశ్వరరావు అవార్డుతో పాటు గాన కోకిల బిరుదు అందజేశారు. వాసురావు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో, తమిళనాడులో సాలూరి రాజేశ్వరరావు జ్ఞాపకార్థం పలు కార్యక్రమాలు జరిగినా కళల కాణాచి తెనాలిలో నిర్వహించడం ప్రత్యేకత సంతరించుకుంటుందన్నారు. ఈ సందర్భంగా సాలూరి స్మారక అవార్డును, గాన కోకిల బిరుదును హైదరాబాద్ కు చెందిన యువ గాయని చాగంటి సాహితీకి ప్రదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆమె పాటలతో కుర్రకారును ఉర్రూతలు ఊగిస్తున్నారని అభినందించారు. కార్యక్రమాన్ని బొల్లిమంత కృష్ణ మాస్టారు, రామరాజు, మురళి, మార్కండేయులు, బెల్లంకొండ వెంకట్ తదితరులు పర్యవేక్షించారు.



సాహితికి బిరుదుతో పాటు అవార్డు ప్రదానం చేస్తున్న సాలూరి వాసూరావు, రామానుజ దాస స్వామి తదితరులు

నూరు శాతం ఆధార్ నమోదు లక్ష్యం

ప్రజాశక్తి - కొల్లిపర

గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో గ్రామ సచివాలయాల పాత్రపై డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం కొల్లిపర జిల్లా పరిషత్ పాఠశాల జరుగుతున్న ఆధార్ నమోదు పనితీరు పరిశీలించి అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో అధికారులతోసమావేశం నిర్వహించారు. సమావేశములో గ్రామములలో జరుగుచున్న అభివృద్ధి కార్యక్రమములు, గ్రామములలో శానిటేషన్ మరియు మంచినీటి సరఫరా పై పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. కొల్లిపర మండలంలో జరుగుచున్న ఆధార్ నమోదు ప్రత్యేక కేంద్రముల పై శ్రద్ధ వహించి 100 శాతము నమోదు జరుగునట్లు చూడవలసినదిగా కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సచివాలయ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమైనదని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో తెనాలి డివిజన్ అభివృద్ధి అధికారి కె శ్రీదేవి గ్రామ సచివాలయాల కోఆర్డినేటర్ మోహన్ రెడ్డి ఎంపీడీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 6 తేదీ గురువారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. సమా వేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. వివిధ ప్రభు త్వ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

30న ఉచిత నవోదయ మోడల్ గ్రాండ్‌టెస్ట్

ప్రజాశక్తి - వినుకొండ

ఉచిత నవోదయ మోడల్ గ్రాండ్ టెస్ట్ 2025 వినుకొండ శ్రీ విజేత కాన్సెప్ట్ స్కూల్‌లో ఈనెల 30వ తారీఖు నిర్వహించబోయే నవోదయ ప్రవేశ పరీక్షకు మూడు నుంచి 8వ తరగతి విద్యార్థులు హాజరు కావచ్చని తెలిపారు. పరీక్ష 30వ తారీఖున ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 12 గంటల 30 గంటల వరకు ఉంటుందనీ, ఈనెల 25 లోపు రిజిస్ట్రేషన్ చేసుకుని హాల్ టికెట్ పొందాలని శ్రీ సాయి మధుర ఎడ్యుకేషనల్ సొసైటీ వారు తెలిపారు ఈ మోడల్ పరీక్షకు ఎలాంటి ఫీజు లేదని పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్ కొరకు 99 66 65 56 17, 94 90 0 3 54 86 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

గురజాల అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష

గురజాల : ఎమ్మెల్యే ఎరపతినేని శ్రీనివాస్ రావు పల్నాడు కన్వెన్షన్ హాల్లో మొంథా తుపాను వల్ల కలిగిన ఏర్పడిన పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి యాక్షన్‌ప్లానులో భాగంగా డ్రైనేజీ ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా సిబ్బందిని ఆదేశం చాలని కమిషనర్ శివన్నారాయణకి తెలిపారు.

రేపటి సోవియట్ విప్లవ వార్షికోత్సవ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పెదకాకాని

సోవియట్ విప్లవ వార్షికోత్సవ సభ 7వ తేదీన గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరుగుతుం దని ఈ కార్యక్రమానికి మండలంలోని సిపిఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని బుధవారం సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోవియట్ యూనియన్లో 1917 నవంబర్ 7వ తేదీన జరిగిన విప్లవోద్యమం పర్యవసానంగా ప్రపంచంలో మొట్టమొదటి శ్రామిక వర్గ రాజ్యం అధికారంలోకి వచ్చిందని,కార్మిక వర్గానికి 8 గంటల పని దినం,ప్రజలకు ఉచిత విద్య, వైద్యం, అందరికీ పని, గఅహ వసతి, వృద్ధాప్యంలో ప్రజలకు భరోసా, రైతాంగానికి వారి శ్రమకు తగ్గ ప్రతిఫలం, సాంస్కృతికంగా వివిధ నైపుణ్యాలు గల ప్రజలకు ఆయా రంగాలలో అభివృద్ధికి ప్రభుత్వ తోడ్పాటు తదితర అనేక సౌకర్యాలు విప్లవం ఫలితంగా సోవియట్ యూనియన్ ప్రజలకు అందాయన్నారు. ఈ వార్షికోత్సవ సభలకు దేశ రాష్ట్ర జిల్లాలోని సిపిఎం పార్టీ నాయకులు, ప్రముఖ వక్తలు పాల్గన్నట్లు ఆయన తెలియజేశారు. కరపత్ర ఆవిష్కరణలో సిపిఎం శాఖ కార్యదర్శి బి బాబురావు జి రాజా రమేష్ కే చిన్నరాగవయ్య ఎం సాంబయ్య జెట్టి రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ బ్రహ్మయ్య

మహిళ మృతిపై పోలీసుల విచారణ

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరు గ్రామంలో మంగళవారం మృతి చెందిన ముడెం లక్ష్మి మృతిపై అను మానాలున్నాయంటూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాత్రి వినుకొండ తరలించినట్లు ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు. కేసు విచారణలో భాగంగా రాపర్ల వారి చెరువు కట్టపై ఘటన ప్రాంతాన్ని వినుకొండ రూరల్ సీఐ బి.బ్రహ్మయ్య బుధవారం పరిశీలించారు. మృతురాలి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను విచారించారు. అయితే కుటుంబ సభ్యులు ఓ వ్యక్తిపై అనుమానాన్ని వ్యక్తం చేయడంతో పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. పోస్టుమార్టం నివేదిక వస్తే మృతికి గల కారణాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - తెనాలి



స్థానిక రైల్వేస్టేషన్ ఒకటో నంబరు ప్లాట్ ఫారంపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు బుధవారం గుర్తించారు. మృతుడి వయసు సుమారు 40 ఉంటుందని, ఆకుపచ్చ గళ్ల చొక్కా ధరించి ఉన్నాడని, ఛాతీపై హార్ట్ సింబల్, ఇంగ్లీషులో ఆర్‌బి అక్షరాల పచ్చబొట్టు ఉందని పోలీసులు తెలిపారు. మృతదేహన్ని తెనాలి వైద్యశాల మార్చురీకి తరలించారు. జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 72027076614 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.



పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ఘనంగా నగేష్‌బాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - అమరావతి

మండల పార్టీ నాయకులు నగేష్ బాబు పుట్టినరోజు నిర్వహించారు. పుట్టినరోజు సంబరాల్లో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, కామిరెడ్డి నవీన్, కట్ట రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతికి అవకాశాలు

ప్రజాశక్తి - రాజుపాలెం

ప్రభుత్వం అందించే ప్రోత్సాహక పథకాలతో మహిళ లు మరింత ఆర్థిక ప్రగతిని సాధిస్తారని ప్రాజెక్టు డైరెక్టర్ ఝాన్సీరాణి అన్నారు. బుధవారం రాజుపాలెం మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి ఝాన్సీరాణి మాట్లా డుతూ వార్షిక ఆర్థిక జీవనోపాధి ప్రణాళిక, సూక్ష్మ రుణ ప్రణాళిక ద్వారా మహిళలు ఆర్థిక పురోగతి పెంపొందుతుందని తెలిపారు. అర్హులు రుణాలు తీసుకొని సంబంధిత యూనిట్లు ఏర్పాట్ల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో ఏపీఎం శివ కుమార్ పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - గురజాల

గురజాల మండలం పులిపాడులో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే ఎరపతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు ప్రజలకు మెరు గైన వైద్యం అందించేందుకు కూటమి ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సిఐటియు జిల్లా మహాసభల కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి- తాడేపల్లి



మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు గుంటూరు జిల్లా 18వ మహాసభలు ఈనెల 23, 24 తేదీల్లో తాడేపల్లి పట్టణంలోని అమరారెడ్డి భవన్లో నిర్వహిస్తు న్నట్లు సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు తెలిపారు. మంగళవారం మహాసభల సందర్భం గా ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భం గా దుర్గారావు మాట్లాడుతూ కార్మికవర్గ సమస్యలపై నిరం తరం పోరాటం సాగిస్తున్న సిఐటియు మహా సభలు ఉద్య మాల గడ్డ తాడేపల్లిలో జరగటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 300 మంది ప్రతినిధులు మహాసభ ల్లో పాల్గొంటారని చెప్పారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్యచరణ ప్రణాళిక రూపొందిస్తా రని పేర్కొన్నారు. తాడేపల్లి పట్టణంలో విధి నిర్వ హణలో చనిపోయిన ఆశా కార్యకర్తకు, విద్యుత్ షాక్‌తో చని పోయిన భవన నిర్మాణ కార్మికునికి సిఐటియు అండగా నిలబడి, పోరాడి లక్షల రూపాయలు నష్టపరిహారం ఇప్పించిందన్నారు. పరిశుద్ధ కార్మికులను ఆప్కాస్‌లోనే కొనసాగించాలని పోరాడి ఫలితం సాధించామన్నారు. 42 రోజులపాటు జరిగిన అంగన్వాడి సమ్మె పోరాటం కార్మికు ఉద్యమానికి మైలురాయిగా నిలిచిందని తెలిపారు. గ్రాట్యూటి, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు 42 రోజుల సమ్మె కాలానికీ వేతనాన్ని సాధించుకున్నామన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం, ఆటో, ముఠా, కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుకు పోరాటాలు చేపట్టినట్లు తెలిపారు. ఎండిఎం, పాఠశాల శానిటేషన్ కార్మికుల వేతనాల కోసం,వీఆర్ఏ, వివోఏల పోరాటాలతో దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఏఐసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు ఇచ్చి నిల బడిందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానం స్థానంలో 12 గంటల పని విధానం తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నట్లు చెప్పారు. ప్రైవేటీకరణ ఆపాలని, కార్మిక చట్టాల సవరణ వెనక్కి తీసుకోవాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని చేసిన ఉద్యమాలు ఘనత సిఐటికే దక్కుతుందని తెలిపారు. ఈ క్రమంలో తాడేపల్లిలో జరుగు తున్న సిఐటియు జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు నారిన నాగేశ్వరరావు, కోట బాబురావు, డివి భాస్కర్ రెడ్డి, కె మేరీ, సాతులూరి ఆదాం, అనిత పాల్గొన్నారు.

ప్రజా వైద్యం... ప్రజల హక్కు

ప్రజాశక్తి- తాడేపల్లి



కోటి సంతకాల కార్యక్రమంలో వైసిపి నాయకులు

వైసిపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు మం గళగిరి నియోజకవర్గం సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు, పొన్నూరు నియోజకవర్గ పరిశీ లకులు బుర్రముక్కు వేణుగోపాలసోమి రెడ్డి సూచనలు మేర కు బుధవారం కోటి సంతకాల కార్యక్రమం చేపట్టారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేస్తూ మద్దతు తెలియ జేసిన వార్డు ప్రజలకు నాయకులు అభినందనలు తెలిపారు. పార్టీ నాయకులు చాగంటి బాపిరెడ్డి జక్కిరెడ్డి వెంకటకష్ణారెడ్డి, జక్కిరెడ్డి లింగారెడ్డి, అమ్మిరెడ్డి యోగిరెడ్డి, తాటిపత్రి కోటిరెడ్డి, పేరం హరినాథ్ రెడ్డి, వేముల శివయ్య, జక్కిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గర వెంకటేష్, గోవిందరెడ్డి, నాగలక్ష్మి, డి.వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్.కోటేశ్వర రావు, ఎం.చంచి రెడ్డి, జె.కోటిరెడ్డి, వేములనాగేశ్వరరావు, ఎం. రమణా రెడ్డి, ఆర్. వీరారెడ్డి, కె.కేశవరెడ్డి పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని స్వామి వివేకానంద ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణంలోని సేవాశ్రమంలో కులమతాలకతీతంగా కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ మెట్టు గోవింద రెడ్డి మాట్లాడుతూ కుల, మత, వర్గ, భాష , భేదం లేకుండా అందరినీ సమన్వయ పరుస్తూ సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసినట్లు గోవిందరెడ్డి తెలిపారు. ముఖ్యఅతిధి మాచర్ల మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు మాట్లాడుతూ కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సహ పంక్తి భోజనాలు ఏర్పాటు చేయటం అందరూ కలిసి మెలిసి జీవించడానికి ఎంతో దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో లాయర్ నాగిరెడ్డి, సిడిపిఓ కష్ణవేణి, డిప్యూటీ ఎక్స్ డిఈఓ రామకృష్ణ, అందుగుల చంద్రయ్య, పి. హరిబాబు, పి.శ్రీనివాసరావు, రాయప్ప, సిహెచ్ రుక్మిణి, ఏ రాజేశ్వరి, మంగమ్మ సుందరమ్మ, రామచంద్రరావు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



వనభోజనాల్లో పాల్గొన్న ప్రజలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో జరిగిన కార్తిక వన భోజన కార్యక్రమంలో నరసరావు పేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకష్ణదేవరాయలు పాల్గొన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా గుడిపూడిలో ఉన్న శ్రీ మాతశ్రీ అచ్చ మాంబ సమేత పుల్లయ్య స్వామి కళ్యాణ మహోత్సవం బుధవారం నిర్వహించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హాజరయ్యారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దరవూరి నాగేశ్వరరావు యెలినేడి రామస్వామి గుడిపూడి సోసైటి అధ్యక్షులు గద్దె అప్పారావు గ్రామ టిడిపి నాయకులు లగడపాటి గజానన మాజీ సొసైటీ అధ్యక్షులు కె.పుల్లారావు, టిడిపినాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణి చేస్తున్న ఆలపాటి

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - తెనాలిరూరల్

రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచే విధంగా కూటమి ప్రభుత్వం అనేక సంస్కరణలు, తెచ్చిందని శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో 13 మంది లబ్ధి దారులకు రూ.8, 41,769లక్షలు విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న బాధితులకు సిఎం రిలీఫ్ ఫండ్ ఒక వరమన్నారు.

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE, SENIOR DIVISION, NARASARAOPET
I.A. No. 82/2025 O.S. No. 11/2025

Between :
gonuguntla Rambabu
... Petitioner / Plaintiff
Vs
Pandillapalli Renuka Devi and others
.... Respondents/ Defendants

To,
Respondent No. 3:
Jadda Venkata Narayana, S/o Ramaiah, R/o Patha Chervukommupalem, Village, H/o Inavolu, Nuzendla Mandal, Palnadu District.

పై నెంబరు గల కేసులో పిటీషనర్ మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు ఈ నోటీసు అందించమని ఉత్తర్వులు జారీ చేసివున్నారు. కావున ది. 26-11-2025వ తేదీన ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, మీ ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై ఈ పైన తెలిపిన పిటీషన్‌పై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ యందు పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి అనుమతితో)

వాయిదా : 26-11-2025

ఇట్లు
ఎం.హరీష్‌కుమార్,
న్యాయవాది, నరసరావుపేట.
సెల్ : 9000727483

BEFORE THE MOTOR ACCIDENTS CLAIM TRIBUNAL-CUM-V-ADDL-DISTRICT JUDGE: R.R.DISTRICT AT: L.B.NAGAR.
M.V.O.P. No. 535 of 2022

Between:
Reka Siva Shankar Rao
AND
...Petitioner
Mr. Shiva Babu & Others
...Respondent

To.
2 . Mr. Shaik. Parvin, S/o. Shaik.Khasim Aged major, occupation: Business, Door. No. 18-4-3, Kedhareswara Peta, Vijayawada Urban, Krishna District, A.P.State-520003.
3. Smt. Venigalla.Jyothi, W/o. Venigalla. Srinivasa Rao Aged major, occupation: Business, Door. No. 8-19, Rajiv Centre, Mangalagiri Town Guntur District, A.P.State 522503

NOTICE

Please take notice that in the above matter the Petitioner had filed case against you (RESPONDENTS. No. 2 & 3) for compensation for Rs.25,00,000/- and the same is posted for you appearance on 28-11-2025.

You are advised to appear on **28-11-2025** at **10.30** A.M. before the said court either in person or through an Advocate failing which, the case will be decided exparte.

(BY THE ORDER OF THE COURT)

T.VENKANNA
Advocate
Counsel for Petitioner
H.No.1-92/1/B, Ayyappa colony, Road.No.3, Thatti Annaram, Nagole X Road, Hyderabad - 68.
Mob: 9000733477.

L.B.NAGAR.
Date: 06-11-2025

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ గౌరవనీయ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి : (జూనియర్ డివిజన్) సత్తెనపల్లి
ఓ.యస్. 800/2023

యామర్తి వెంకటేశ్వర్లు .... వాది
మరియు
షేక్ సైదా సాహెబ్ .... ప్రతివాది

టు
షేక్ సైదా సాహెబ్, తండ్రి మస్తాన్ సాహెబ్,
నివాసం: ఇనిమెట్ల గ్రామం, రాజుపాలెం మండలం, పల్నాడు జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాదియైన నీకు అనేక మార్లు సమన్లు పంపిననూ, తీసుకోనందున, శ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా తెలియపర్చమని కోరినందున ఈ ప్రకటన ద్వారా తెలియపర్చటమైనది. పై దావాలో మీ హాజరు కొరకు తేది:25-11-2025కి వాయిదా వున్నందున, ఆ రోజు ఉదయం గం॥ 10.30 లకు శ్రీకోర్టు వారి ఎదుట వ్యక్తిగతంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది లేని యెడల మీ పరోక్షమున పై నెంబరు దావా తీర్మానించెదరు.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుననుసరించి

వాయిదా ది: 25.11.2025

ఇట్లు
దేవినేని దస్తగిరిరావు
గంటా వెంకట శివ
న్యాయవాదులు, సత్తెనపల్లి
సెల్ : 9885945678

ప్రకటన

పల్నాడుజిల్లా, నరసరావుపేట పట్టణం, మేదరబజారు, డోర్ నెం. 14-1-218 నివాసి, శిఖాకొల్లి పిచ్చయ్యగారి కుమారుడు రమేష్‌బాబు గారి సమాచారాన్ని అనుసరించి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింట్ శిఖాకొల్లి రమేష్‌బాబుగారి పేరును నామినిగా పేర్కొనబడిన, వారి తండ్రిగారైన శిఖాకొల్లి పిచ్చయ్యగారు ది. 16-07-2016న MMDC No. 3551068006 నెంబరుతో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులో డిపాజిట్ చేసిన డిపాజిట్ తాలూక ఒరిజినల్ బాండ్, వారి తండ్రిగారు ది. 12-09-2018 తేదీ మరణించే కొద్దిరోజుల ముందు నా క్లయింటుకు స్వాధీనం చేసుకున్నారు. సదరు ఒరిజినల్ బాండ్ ది. 21-10-2025న నరసరావుపేట పట్టణం, ఎల్.బి.మార్కెట్ సెంటర్‌లో నా క్లయింట్ సదరు ఒరిజినల్ బాండ్‌తో పాటు మరికొన్ని ముఖ్యమైన కాగితాలు జిరాక్స్ తీయించే క్రమంలో పోగొట్టుకొని వున్నారు. సదరు ఒరిజినల్ బాండ్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

షేక్ జమీర్‌బాష,
న్యాయవాది, నరసరావుపేట.
సెల్ : 9032067078
మరియు
శిఖాకొల్లి రమేష్‌బాబు,
సెల్ నెం : 9014500999

మహారాజశ్రీ ప్రధాన సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్) గారి కోర్టు, నరసరావుపేట
I.A. No. 4/2025, I.A. No. 5/2025, I.A. 6/2025, O.S. No. 33/2024

Between :
1) Shaik Mastanbi మరియు 2 ఇతరులు
.... పిటీషనర్స్ / వాదులు
Vs
1) Shaik Nazeer Mahammad (died)
మరియు 2 ఇతరులు ... రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

పై దావాలో పై పిటీషన్‌ను ఇందలి వాదులు/ పిటీషనర్స్, పై కోర్టులో L.Rs పిటిషన్ దాఖలు చేయగా, ఇందలి 4వ రెస్పాండెంట్స్/4వ ప్రతివాదికి అనేక పర్యాయములు నోటీసులు పంపిననూ సర్వు కానందున శ్రీ కోర్టువారు 4వ రెస్పాండెంట్స్/4వ ప్రతివాదికి ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఆర్డరు వేయటమైనది. కావున తదుపరి వాయిదా తేదీన అనగా ది. 10-11-2025న ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా లేక లాయరుగారి ద్వారా హాజరై ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల 4వ రెస్పాండెంట్స్/4వ ప్రతివాది యొక్క పరోక్షమున కేసు తీర్మానించబడును.

వాయిదాతేది : 10-11-2025

ఇట్లు
ఎస్.అయ్యప్పరాజు
అడ్వకేట్, నరసరావుపేట.

ప్రతి గ్రామంలో 50 మందితో ప్రకృతి సేద్యం : పల్నాడు కలెక్టర్



ప్రకృతి పంటల విక్రయాలను పరిశీలిస్తున్న పల్నాడు కలెక్టర్ కృతికా శుక్ల... ఆక్రమణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

ప్రజాశక్తి - రాజుపాలెం

ప్రతి గ్రామంలో 50 మంది రైతులను ప్రకృతి సేద్యంవైపు ప్రోత్సహించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల అన్నారు. నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్ఎంఎన్ఎఫ్) కార్యక్రమం క్రింద రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఐసిఆర్పీలకు రాజుపాలెంలో ఐదు రోజుల శిక్షణను ఏర్పాటు చేయగా కలెక్టర్ బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు, జ్యోతి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంలోని తొమ్మిది సూత్రాలు గురించి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి వివరించారు. 2019లో ఒక ఎకరంతో మొదలుపెట్టి ప్రస్తుతం ఆరెకరాల్లో కూరగాయలు, పూలు, పండ్లు సాగు చేస్తున్నామని, పెట్టుబడి ఖర్చు తగ్గి లాభం పెరిగిందని, పొలం వద్దే పంటలను అమ్ముతున్నామని రైతులు చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 82 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు లక్ష్యం కాగా ఖరీఫ్‌లో 60 వేల ఎకరాల్లో సాగైందని చెప్పారు. ప్రతి మండలంలో ప్రకతి వ్యవసాయ వనరుల కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ఈ సంవత్సరం సర్టిఫికేషన్ ఇస్తామని, ద్వారా ఉత్పత్తులకు మార్కెట్ ధర కంటే 1.5 రెట్లు ఎక్కువ ధర లభిస్తుందని తెలిపారు. కూలీల కొరతను అధిగమించడానికి ప్రభుత్వం అందిస్తున్న డ్రోన్ పిచికారీ విధానాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. అమలకుమారి మాట్లాడుతూ జిల్లాలో 132 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం అమలవుతోందని, రబీ సీజన్‌లో 398 గ్రామ పంచాయతీల్లో అమలు చేయబోతున్నామని తెలిపారు.ప్రతి మూడు గ్రామాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, మొత్తం 190 క్లస్టర్లలో 125 మంది రైతులు 125 ఎకరాల్లో ప్రకృతి సాగు చేపడతారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు, డిఆర్‌డిఎ పీడీ ఝాన్సీ, జిల్లా ఉద్యానవన అధికారి వెంకట్రావు, ఏపీఎంఐ పీడీ ఆంజనేయులు, తహశీల్దార్ ఎన్.సరోజ, ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఎపిఎం శివకుమార్, క్రోసూరు డివిజన్ ఎడిఎ మస్తానమ్మ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్‌పై సదస్సు

ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మండలంలోని గణపవరం గ్రామంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ అవగాహన సదస్సును వ్యాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో నిర్వహించగా కలెక్టర్ హాజరయ్యారు. రైతు దొప్పలపూడి నాగేశ్వరరావు పొలంలో మొక్కలు నాటారు. జిల్లాలో మొదటి విడతలో ఆయిల్ పామ్ సాగుకు 8 మండలాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని, వీటిల్లో సత్తెనపల్లి, రాజుపాలెం మండలాలు న్నాయని తెలిపారు. రైతుకు పామాయిల్ పంటల కొనుగోలు ఒప్పంద పత్రాలను అందించారు. జిల్లా ఉద్యాన అధికారి వెంకట్రావు మాట్లాడుతూ ఆయిల్ పామ్ పెంపకం కోసం నీరు సమృద్ధిగా ఉండాలని, ఏడాది పొడవునా నీటి సౌలభ్యం ఉన్న రైతులు ముందుకు రావాలని సూచించారు. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా డ్రిప్ ఇరిగేషన్ అమర్చుకోవాలన్నారు. కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎం.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఆయిల్ పామ్ కొనుగోలులో దళారుల వ్యవస్థ ఉండదదని, ప్రభు త్వం నిర్ణయించిన ధరకు నేరుగా కంపెనీ కొంటుందని అన్నారు. ఎకరాకు ఖర్చులుపోను రూ.లక్ష మిగులుతుందన్నారు.

ఆక్రమణదారులతో పంచాయతీ కార్యదర్శి కుమ్మక్కు

రాజుపాలెంలోని పంచాయతీ స్థలాల ఆక్రమణల తొలగింపులో పంచాయతీ అధికారుల అలసత్వం వహిస్తున్నారని కలెక్టర్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. మూడు గ్రామాల ప్రజలు నిత్యం వ్యవసాయ, ఉద్యోగ, వ్యాపార, తదితర అవసరాల నిమిత్తం నిత్యం తిరిగే రహదారి చుట్టుపక్కల పంచాయతీ స్థలాలను కొందరు ఆక్రమించారని చెప్పారు. ఆక్రమణదారులకు మూడుసార్లు నోటీసులిచ్చినా స్పందించడం లేదని, వారితో పంచాయతీ కార్యదర్శి కుమ్మక్కవడమే ఇందుకు కారణమని ఆరోపించారు. ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు.



నారా రోహిత్ దంపతులతో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఇతర టిడిపి నాయకులు

నారా రోహిత్ దంపతులను కలిసిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి - రెంటచింతల

సినీ నటుడు నారా రోహిత్ దంపతులను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం రాత్రి రెంటచింతలలో కలిశారు. గతనెల 30వ తేదీన రెంటచింతలకు చెందిన లేళ్ల శిరీషను రోహిత్ వివాహమాడారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా రెంటచింతలకు వచ్చిన రోహిత్‌తో ఎమ్మెల్యే గంటపాటు భేటీ అయ్యారు. తాను పుట్టి పెరిగింది ఈ మండలంలోని మంచికల్లు గ్రామమేనని, సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో ఐదేళ్లు విద్యాభ్యాసం చేశానని ఎమ్మెల్యే చెప్పారు. 2009కు పూర్వం ఈ మండలం గురజాల నియోజకవర్గంలో ఉండేదని, ఆ తర్వాత నియోజకవర్గాల పునర్వ్యస్థీకరణలో మాచర్లలో విలీనమైందని తెలిపారు. ఇదిలా ఉండగా పలువురు టిడిపి నాయకులు సైతం రోహిత్‌తో మాట్లాడి శుభాకాంక్షలు చెప్పారు..

లోకేష్‌కు కంబాల వెంకటేశ్వరరావు ధన్యవాదాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్



పేరేచర్ల కొండమోడు రహదారి నిర్మాణ పనులు వేగవంతం చేసినందుకు మంత్రి లోకేష్‌కు టిడిపి పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి లయన్ కంబాల వెంకటేశ్వరావు ధన్యవాదాలు తెలిపారు. టిడిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రజాదర్బారులో లోకేష్‌ను వెంకటేశ్వరరావు కలిశారు.



బోర్డుకు అంటించిన నోటీసు వద్ద ఎంఇఒ నాగరత్నం

లూథరన్ పాఠశాల బోర్డుకు ఉత్తర్వులు

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడులోని లూథరన్ పాఠశాలను ఆర్‌జెడి లింగేశ్వరరెడ్డి ఇటీవల తనిఖీ చేసిన విషయం తెలిసిందే. ఇక్కడ విద్యార్థులు లేకపోవడంతో ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేస్తామని ఆర్‌జెడి ప్రకటించారు. ఇందులో భాగంగా జిల్లా ఉప విద్యా శాఖాధికారి సుభాని, మండల విద్యాశాఖాధికారి నాగరత్నం బుధవారం మరోసారి పాఠశాలను సందర్శించి ఉన్నతాధికారులిచ్చిన ఉపాధ్యాయుల రిలీవింగ్ ఉత్తర్వులను హెచ్‌ఎంకు ఇవ్వబోగా వాటిని తీసుకోవడానికి హెచ్‌ఎం పద్మలత నిరాకరించారు. తమ పాఠశాల మూసివేతను నిలిపివేస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని, ఆ ఉత్తర్వులు రావడానికి సమయం పడుతుందని, అప్పటివరకు రిలీవింగ్ ఉత్తర్వులు తీసుకోబోమని చెప్పారు. దీంతో ఆ ఉత్తర్వుల ప్రతిని ఎంఇఒ నాగరత్నం నోటీస్ బోర్డులో అంటించారు.

పంట నష్టం నమోదు సరిగా లేదని రైతుల ఆవేదన

ప్రజాశక్తి - క్రోసూరు



మొంథా తుపాను వల్ల పంట నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపరిహారం చెల్లించాలని తహశీల్దార్ నాగరాజుకు రైలు, కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో యడ్రబాలెం రైతులు బుధవారం విన్నవించారు. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం జిల్లా నాయకులు టి.హనుమంతరావు మాట్లాడుతూ తుపాను వల్ల ఈ ప్రాంతంలో మిర్చి పంట పంటతో పాటు పత్తి పంట కూడా పాక్షికంగా దెబ్బతిందని, అయితే నష్టపరిహారాన్ని అధికారులు సరైన రీతిలో నమోదు చేయడం లేదని రైతులు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. పొలాను అధికారులు సందర్శించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతులు ఇప్పటికే మిర్చికి రూ.70 వేలు, పత్తికి రూ.40 వేలు చెప్పున ప్రతి ఎకరాకు పెట్టుబడి పెట్టారని అన్నారు. దిగుబడులు బాగా తగ్గిపోతాయని, బాధితుల్లో ఎక్కువ మంది కౌలురైతులేనని తెలిపారు. ఈ-క్రాప్‌లో కౌలు రైతుల పేర్లు సరిగా నమోదు చేయడం లేదని, ఈ కారణంగా వారికి నష్టపరిహారంతోపాటు అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయమూ అందకుండా పోయే ప్రమాదముందని అన్నారు. అధికారులు సత్వరం స్పందించి కౌలురైతులను నమోదు చేయాలని, పరిహారం, పెట్టుబడి సాయం వారికి అందేలా చూడాలని కోరారు. ఇందుకు తహశీల్దార్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. వినతిపత్రం ఇచ్చినవారిలో ఎన్.శ్రీనివాసరావు, ఎస్.వెంకట్రావు, కె.శ్రీనివాసరావు, వి.శివయ్య, ఎస్.రామాంజనేయులు ఉన్నారు.

శకుంతల జనరల్-గ్యాస్ట్రో లివర్‌కేర్ హాస్పిటల్‌లో అరుదైన చికిత్స

కోత, కుట్లు లేకుండా నాలుగేళ్ల చిన్నారి మింగిన గోళి వెలికితీత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఆడుకుంటూ.. పొరబాటున గోళి మింగి అస్వస్థతకు గురైన నాలుగేళ్ల చిన్నారికి శకుంతల జనరల్-గ్యాస్ట్రో లివర్ కేర్ హాస్పిటల్‌లో అరుదైన చికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఈ మేరకు వివరాలను హాస్పిటల్ అధినేత డాక్టర్ ఐలా శ్రీనివాస్ బుధవారం వెల్లడించారు. మండల కేంద్రమైన నకరికల్లుకు చెందిన సైదా, జుమ్మాబి దంపతుల బిడ్డ మూడ్రోజుల నుండి కడుపు నొప్పితో బాధపడుతుండగా తమను సంప్రదించారని, గోళి మింగినట్లు తమ పరీక్షల్లో తేలడంతో కోత, కుట్లు లేకుండా ప్రేగుకు గాయాలు కాకుండా ఎండోస్కోపి ద్వారా గోళీని బయటకు తీశామని తెలిపారు. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు వంటి మహా నగరాల్లో జరిగే అరుదైన చికిత్సలు ఎన్నో తమ హాస్పిటల్‌లో విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. తమ హాస్పిటల్‌లో జనరల్, గ్యాస్ట్రో, లివర్ తదితర వ్యాధులకు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో 24x7 వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.



పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేయండి : పల్నాడు డిఇఒ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులో గల మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలను పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ బుధవారం సందర్శించారు. 10 తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను, విద్యార్థిని విద్యార్థులు రాసిన నోటు పుస్తకాలను పరిశీలించారు. మంచి ప్రవర్తన కలిగి, క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచించారు. విద్యార్థి దశకు కీలకమైన 10 తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని హెచ్‌ఎం రవికాంత్, ఉపాధ్యాయులకు సూచించారు. గతేడాది 10వ తరగతి ఫలితాల్లో పల్నాడు విద్యార్థులు రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించారని, ఈ ఏడాది కూడా అదే ఒరవడి కొనసాగించాలని అన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను బట్టి ఏ, బి, సి, డి గ్రేడ్‌లుగా విభజించి సి, డి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారికి ప్రత్యేక స్టడీ మెటీరియల్ డిసిఈబి ద్వారా పంపుతామని చెప్పారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు.

రికవరీ సొమ్ము చెల్లించకుంటే చర్యలు

ప్రజాశక్తి-ఈపూరు : సామాజిక తనిఖీల్లో గుర్తించిన రికవరీ సొమ్మును వెంటనే చెల్లించని వారిపై చర్యలు ఉంటాయని పల్నాడు జిల్లా విజిలెన్స్ అధికారి హీరాలాల్ అన్నారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో క్షేత్ర సహాయకులతో బుధవారం సమావేశమైన హీరాలాల్ మాట్లాడుతూ గతంలో జరిగిన సామాజిక తనిఖీల్లో మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో రికవరీ సొమ్ము చెల్లించాల్సి ఉందన్నారు. ఏపీడీ ఈపూరి బూసిరెడ్డి మాట్లాడుతూ ఈకేవైసీ 79 శాతం నమోదు చేశారని, రెండు మూడు రోజులలో వంద శాతం పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. సామాజిక తనిఖీ జరుగుతున్న క్రమంలో ఆయా పనులకు సంబంధించిన రికార్డులను సక్రమంగా సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ పుష్పరాజ్, టిఏలు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇవ్వకుంటే ఆందోళన చేస్తాం : సిపిఎం

ప్రజాశక్తి - పెదనందిపాడు

మొంథా తుపాను కారణంగా నష్టపోయిన పంటలకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని, లేనిచో ఆందోళనలకు పూనుకుంటామని సి.పి.ఎం. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు హెచ్చరించారు. బుధవారం స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో జరిగిన సి.పి.ఎం. మండల కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి నల్లమోతు రాజేంద్ర అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ ప్రతిపాడు నియోజకవర్గంలో ఇటీవల సంభవించిన తుఫానుకు వరి, పత్తి, మిర్చి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పారు. కాకుమాను మండలం అప్పాపురం బి.టి.వద్ద నల్లమడ వాగు కట్ట తెగి నీరు పొలాల పైబడి వేలాది ఎకరాలు వరి పంట ముంపుకు గురైందని అప్పాపురం గ్రామంలోనికి నీరు చేరి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయని చెప్పారు. వ్యవసాయ శాఖ వారు పంటలను పరిశీలించి, వివక్ష లేకుండా నష్టపరిహారాన్ని అంచనా వేసి ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు 33% పంట దెబ్బతింటేనే నష్టాన్ని అంచనా వేస్తామని ప్రకటించడం అవివేకమని,



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు

దెబ్బతిన్న పంటలకు వెంటనే పరిహారం ఇవ్వాలని కోరారు. ఇప్పటికే కౌలు కాకుండా వరికి 25000, మిర్చికి 40000, పత్తికి 30000 రూపాయలు ఖర్చు చేశారని, వరి గతంలో రెండుసార్లు ఎద పెట్టారని, మరలా ప్రస్తుత తుఫానుకు నష్ట పోయారని, వెంటనే రైతులకు నష్టపరి హారం ఇవ్వాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు మాట్లాడుతూ కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ 20 వేల రూపాయలు ఇవ్వాలని ,పంట నష్టపరిహారాలను కౌలు రైతులకే ఇవ్వాలని, యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులను ఇచ్చి, పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. రైతు సేవా కేంద్రాలలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. అన్ని మండల కేంద్రాలలో సీ.సీ.ఐ. కేంద్రాలు తెరిసి పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. పెదనందిపాడు లోని నల్లమడ వాగు కర కట్ట పై నివసిస్తున్న నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ,ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, బియ్యం కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వాలని కోరారు. తుఫానుకు పాడైపోయిన రోడ్లకు వెంటనే మరమ్మత్తులు చేయాలని కోరారు. నల్లమడ ఆధునీకరణకు నిధులు కేటాయించాలని, గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగి ంచేందుకు భూసేకరణకు అవసరమైన 120 కోట్లు ఒకేసారి కేటాయించి భూసేకరణ చేయాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో సిపిఎం మండల నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, ఫణిదపు భువనేశ్వరి, మర్రి లక్ష్మి, షేక్ షమీ పాల్గొన్నారు.

అక్టోబర్ విప్లవ వార్షికోత్సవ సభను జయప్రదం చేయండి

ఈనెల 7వ తేదీ శుక్రవారం సాయంత్రం గుంటూరులో జరిగే అక్టోబర్ విప్లవ వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని సి.పి.ఎం. పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు కోరారు. సోవియట్ విప్లవ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 7వ తేదీన గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో "పెట్టుబడిదారీ విధానం - భవిష్యత్"అనే అంశంపై జరిగే సభలో ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.


అన్నదానం చేస్తున్న ఫెడరేషన్ నాయకులు

ఘనంగా ఎపిడబ్ల్యూజెఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజసక్తి - తెనాలిరూరల్

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజేఎఫ్) అవిర్భావ దినోత్సవ వేడుకలను తెనాలిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెనాలి డివిజన్ అధ్యక్షులు అంబటి శ్యామ్ సాగర్, కార్యదర్శి అచ్యుత సాంబశివరావు బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ మహాత్మ సేవా శాంతి ఆశ్రమంలో వృద్ధులకు అన్నవితరణ చేశారు. ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా వ్యవహరించే జర్నలిస్టులు ఆశ్రమానికి విరాళం అందించడం ముదావహమన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కనపర్తి రత్నాకర్, ఫెడరేషన్ గౌరవ సభ్యులు ఎస్ఎస్ జహీర్, కరేటి సాంబశివరావు, దేవరపల్లి నాగరాజు, చింత మణి, ఉన్నం భూషణం, నాగ మల్లేశ్వరరావు, కోడూరి నాగరాజు, శ్రీరామ్ సుభాష్, మాలేపాటి తిరుమలేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - దుగ్గిరాల

మొంథా తుపాను వల్ల పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జొన్నా శివశంకర్ కోరారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం సమావేశం జరిగింది. శివశంకర్ మాట్లాడుతూ తుపాను వల్ల మండల పరిధిలోని క్యాలీఫ్లవర్ పంట పూర్తిగా నాశనమైందని, రైతులకు 50 నుండి 60 వేల రూపాయలు నష్టం వచ్చిందన్నారు. నిమ్మ రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. నిమ్మ పంటకు రేట్లు లేవు. మరొకపక్క కోసే పరిస్థితి లేదు. వర్షాలకు పంట రాలిపోయిందని చేలలో నీరు మురుగు నిల్వ ఉండటం వల్ల కాయలు కుళ్ళిపోతున్నాయని తెలిపారు. వెంటనే ఆదుకోవాలని అన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, వర్షాలకు చేలలో నీరు బయటకు వెళ్లే మార్గం లేదన్నారు. 100 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన కల్వర్టులు, తూములు, డ్రైనేజ్ కాలువలు పూడుకుపోయి ఉన్నాయని వాటిని ఆధునికరించీ చేలలో నీళ్ల నిల్వకుండా చర్యలు చేపట్టాలన్నారు. లో వోల్టేజి సమస్య వలన ఈ ప్రాంతంలోని ఈ ప్రాంతంలోని రైతులు ప్రజల్ని తీవ్ర ఇబ్బంది పడుతున్నారని దుగ్గిరాల ప్రాంతంలో నీ తూర్పు వైపు సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. వాణిజ్య పంటలు ఉద్యానవన పంటలు తీవ్రంగా నష్ట పోయాయి రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వరి పంటకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 17న దుగ్గిరాలలో



మాట్లాడుతున్న జొన్నా శివశంకర్

మండల మహాసభలు జరుగుతున్నాయని, రైతులు మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు మాట్లాడుతూ ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తామన్నది పంట పండించిన రైతులు కౌలు రైతులు అందరి వద్ద కొనుగోలు చేయాలన్నారు. ఈ ప్రాంతంలో చాలా చోట్ల రైతులు పంట నష్టపోయారని, ఆదుకోవాలని కోరారు. కూలీలు జీవనోపాధి లేక కష్టపడుతున్నారు ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. పునరావాస కేంద్రాలకు రానివారికి నష్టపరిహారం చెల్లించలేదు రానివారిలో కూడా చాలామంది పేదలు వర్షాల కారణంగా నష్టపోయారు అందరినీ ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నడికుదురు యోగేశ్వరరావు యార్లగడ్డ బ్రహ్మేశ్వర రావు గుడిసేవ యోహాను తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ కార్మికులందరికీ ఉచితంగా వైద్యమందించాలి

- రెండో రోజుకు చేరిన నిరసన
- ర్యాలీ నిర్వహించిన కార్మికులు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఎయిమ్స్‌లో తొలగించిన 35 మంది గార్డెనింగ్ వర్కర్లను వెంటనే పనిలోకి తీసుకోవాలని మంగళగిరి ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్.ఎస్.చెంగయ్య డిమాండ్ చేశారు. ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రెండవ రోజు బుధవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంగళగిరిలో ర్యాలీ నిర్వహించారు. చెంగయ్య మాట్లాడుతూ కార్మికులకు చెప్పకుండా పనిలోంచి తీసివేయడం దారుణమన్నారు. ఐదేళ్లుగా గార్డెనింగ్ కార్మికులు పనిచేస్తున్నారని, కాంట్రాక్టర్ ఈనెల 1వ తేదీన కార్మికులకు వేతనాలు చెల్లించి, కాంట్రాక్ట్ రద్దు అయిందని, ఇక పనికి రావద్దని చెప్పడం సరికాదన్నారు. ఐదు సంవత్సరాలలో వేతనాలు పూర్తిగా చెల్లించకుండా లక్షలాది రూపాయలు కాంట్రాక్టర్ దోసుకున్నారని





ఎయిమ్స్‌లో తొలగించిన గార్డెనింగ్ కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని కోరుతూ రెండవ రోజు నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, మంగళగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

ఆరోపించారు. తొలగించిన గార్డెనింగ్ కార్మికులను వెంటనే పనిలో తీసుకునే అంతవరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వెంటనే ఎయిమ్స్ అధికారులు, డైరెక్టర్ స్పందించి పనిలోకి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎయిమ్స్‌లో పనిచేస్తున్న ప్రతి ఒక్క కార్మికునికి ఉచితంగా వైద్యం అందించాలని అన్నారు. అందుకు సంబంధించిన హెల్త్ కార్డులు ఎయిమ్స్ యాజమాన్యం అందించాలని కోరారు. ఎయిమ్స్ లో పనిచేస్తున్న కార్మికుల జీతాలు ఆలస్యం కాకుండా ప్రతినెల ఐదో తేదీ లోపు వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి ఎయిమ్స్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎం. బాలాజీ, ఆటో యూనియన్ నాయకులు షేక్ కాజా తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న కార్మికులు

337వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

చట్టపరంగా తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 337వ రోజుకు చేరుకున్నాయి. తమకు రావలసిన నష్టపరిహారం కోసం దీక్షల్లో కందుకూరి నాగరాజు, బుట్టి ఏసోబు, ఈ. శారమ్మా, డి.సువర్ణకుమారి, డి.రమణమ్మ కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కె.స్టీవెన్, షేక్ సుభాని, మల్లే గురవయ్య, రహంతుల్లా, తుపాకుల నాగేశ్వరావు, బి.అంకయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ముసలా సాంబశివరావు, వై.పెదసుబ్బారావు, పిచ్చయ్య, ఆశీర్వాదం, డినాగేశ్వరావు, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

రెండు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి

యాక్సెస్ రోడ్డులో ఇళ్లు కోల్పోయే పేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బోటు యార్డు దగ్గర నివాసముంటున్న బాధితులతో సమావేశం ఏర్పాటు చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టిట్కో ఇల్లు ఇస్తామని టిడిపి నాయకులు చెబుతున్నారని, టిడ్కో ఇల్లు తమ అవసరం లేదని పేదలకు దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. రోడ్డు నిర్మాణం సందర్భంగా నిబంధనల ప్రకారం ఆర్ఆర్ ప్యాకేజీ కింద పేదలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం నాయకులు డి.వి.భాస్కర్ రెడ్డి, కె.ఎల్.రావు కాలనీ కార్యదర్శి కె.మేరీ, వి.శ్యామియేలు పాల్గొన్నారు.

సైన్స్ ఎక్స్‌పోజర్ విజిల్‌కు నారాకోడూరు విద్యార్థులు

ప్రజాశక్తి - చేబ్రోలు

సైన్స్ ఎక్స్‌పోజర్ విజిట్ ఎడ్యుకేషనల్ ఢిల్లీ టూరుకు నారాకోడూరు విద్యార్థులు ఎంపిక య్యారని ప్రధాన ఉపాధ్యాయులు ఎం.ఏడుకొండలు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సామాన్య కుటుంబాలకి చెందిన విద్యార్థులు వెలగా అవినాష్, తుపాకుల రవిశంకర్ ఢిల్లీలో ఇస్రో నిర్వహిస్తున్న స్పేస్ వర్క్ షాప్ ఎంపికయ్యారని తెలిపారు. వీరిద్దరూ జిల్లా స్థాయి సైన్స్ సదస్సులో పాల్గొన్నారని, ఇన్‌స్పైర్ పోటీలు, సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఉత్తమ ప్రదర్శన చేశారని వివరించారు. ప్రతిభన చూసి జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక విద్యార్థులకు ఈ అవకాశం కల్పించారని వివరించారు. విద్యార్థులకు గైడ్ టీచర్ హరిప్రసాద్‌కు జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక, సైన్స్ అధికారి గౌస్ మీరా, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు

నాలుగు సిసిఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు : ఏవో

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

పత్రిని కొనుగోలు చేసేందుకు మండలంలో నాలుగు సిసిఐ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి షేక్.సుగుణ బేగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు కేంద్ర ప్రభుత్వం వారు 2025-26 ప్రత్తి సీజన్ లో కనీస మద్దతుగా ధర క్వింటా ఒకింటికి రూ. 8,110/-లు చొప్పున కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ద్వారా ప్రత్తి కొనుగోలు చేయుటకు గాను కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నారని తెలిపారు. రైతులు ప్రత్తిని తెచ్చి అమ్ముకొని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని సూచించారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్ తీసుకొని రైతు సేవాకేంద్రాల్లో సంప్రదించాలన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణ బేగం తెలిపారు.



కమిషనర్ వేణుబాబును సన్మానిస్తున్న ఉద్యోగులు

కమిషనర్‌కు సన్మానం

ప్రజాశక్తి - మాచర్ల

మొంథా తుఫాను సమయంలో ఉత్తమ సేవలకు గాను మాచర్ల మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా ఉత్తమసేవ పురస్కారం అందుకున్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను మున్సిపల్ ఉద్యోగులు సత్కరించి, అభినందనలు తెలిపారు. వేణుబాబు మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బంది, ఇతర శాఖలతో సమన్వయం, ఐక్యంగా తుపాన్‌ను ఎదుర్కొన్నామని, వీలైనంత నష్టాన్ని తగ్గించామని, వరద బాధితులకు అన్ని రకాలుగా అండగా నిలబడ్డామని తెలిపారు. కష్టపడి పనిచేస్తే ప్రభుత్వం తగిన గుర్తింపు ఇస్తుందని, ఇదే టీం స్పీరిట్‌ను కొనసాగిస్తూ మాచర్ల పురపాలక సంఘానికి మంచి పేరు తీసుకు రావటానికి ఎల్లప్పుడు సహకారాలు అందించాలని ఉద్యోగులను కోరారు. మేనేజర్ చాంద్ బాషా, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షేక్ సుభాని, రెవిన్యూ ఆఫీసర్ విష్ణువర్ధన్, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ఆశిష్‌కుమార్ పాల్గొన్నారు.

పరామర్శల పేరుతో రెచ్చగొట్టొద్దు

ప్రజాశక్తి - మాచర్ల

పరామర్శల పేరుతో రెచ్చగొట్టే ప్రయత్నాలను జగన్ మానుకోవాలని మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు హితవుచెప్పారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు రైతుల సంక్షేమం పట్టించుకోకుండా, ప్రకతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు సహాయ సహకారాలు అందించకుండా, ఇపుడు తుపాను రైతుల పరామర్శ పేరుతో నాటకానికి తెర లేపారన్నారు. రైతులకు ఎలాంటి సహాయం అందించలేదని, అధికారులెవరూ రైతులను పరామర్శించడానికి రాలేదని చెప్పి బురద చల్లే కార్యక్రమం మొదలు పెట్టాడన్నారు. కార్యక్రమంలో తిక్క కొండలు, ప్రసాదు, బిజెపి ఈశ్వరయ్య, శ్యామరాజపురం సర్పంచ్ తాటి రామారావు, సాధారల నరసయ్య, దేవరశెట్టి బ్రహ్మం,స్వామి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పూర్ణమ్మకు నివాళి అర్పిస్తున్న వ్య.కా.సం నాయకులు
ఇన్‌సెట్‌లో పూర్ణమ్మ (ఫైల్‌ఫొటో)

దావల పూర్ణమ్మ మృతి

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడుకు చెందిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దావల పూర్ణమ్మ (53) బుధవారం ఉదయం మృతి చెందారు. ఆమెకు భర్త వెంకటేశ్వర్లు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సిపిఎం ఉద్యమాలు, పోరాటాల్లోనూ పూర్ణమ్మ పని చేశారు. ఆమె భౌతికకాయాన్ని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రోశయ్య, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు జె.శంకర రావు, పి.సాంబశివరావు, పి.పుల్లారావు సందర్శించి నివాళులర్పించారు.

చెంచుల వసతుల కల్పనకు అనుమతులు పొందండి : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కల్లి శివారెడ్డి

పిఎం జన్‌మన్ పథకం ద్వారా చెంచుల నివాసాల్లో 11 రకాల మౌలిక వసతుల కల్పన కార్యక్రమాలు వేగవంతానికి అటవీశాఖ నుంచి అనుమతులు పొందాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికశుక్లా ఆదేశించారు. ఈ అంశంపై నరసరావు పేటలోని కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో తాగు నీటి పైప్‌లైన్లు, మొబైల్ టవర్లు వంటి నిర్మాణాల కోసం అనుమతులు పొందే విధానాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఇప్పటికే మంజూరైన 763 ఇళ్ల నిర్మాణాలను మార్చి నాటికి పూర్తి చేసి తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలన్నారు. 15రోజుల్లోగా చెంచుల నివాసాల్లో సర్వే చేసి ఇళ్లు లేని కుటుంబాలు, తాగునీటి సరఫరా పరిస్థితిపై నివేదికలు ఇవ్వాలని చెప్పారు. పిఎం జన్‌మన్‌కు కొనసాగింపుగా అమలు చేయనున్న డీఏ జువా (ధర్తీ అబా జన్ బాగీదారీ అభియాన్) పథకంలో భాగంగా గిరిజన నివాస ప్రాంతాల్లో 25రకాల వసతుల కల్పన కోసం ప్రతి పాదనలు పంపించాలని ఆదేశించారు. మండలస్థాయిలో ఎంపీడీఓలు అన్ని శాఖలతో సమా వేశమై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమీక్షలో జిల్లా అటవీ అధికారి కృష్ణప్రియ, శ్రీశైలం ఐటీడీఏ పీఓ వెంకట శివప్రసాద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బెల్లంకొండ కోటను అభివృద్ధి కోసం వినతి

నిత్యం ఎంతోమంది పర్యాటకులు సందర్శించే బెల్లంకొండ మండలంలోని ప్రసిద్ధిగాంచిన బెల్లంకొండ కోటను అభివృద్ధి చేయడం ద్వారా ఈ ప్రాంతంలో పలువురికి ఉపాధి అవకా శాలు లభిస్తాయని బెల్లంకొండ కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కోట కొండ శిఖరాలను కలుపుతూ రాతి గోడనిర్మిచారని, కొండ శిఖరంపై నిర్మించిన నాలుగు బురుజుల్లో బెల్లంకొండ ఐకాన్‌గా నిలిచే 'అలరాజు బురుజు' కనువిందు చేస్తుందని తెలి పారు. కలెక్టర్ స్పందిస్తూ కోట అభివృద్ధిపై నివేదిక తయారు చేయాలని జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణప్రియను ఆదేశించినట్లు శివారెడ్డి తెలిపారు.

పత్తిపొలాలను జాయింట్ కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి-అచ్చంపేట



పత్తి రైతులతో మాట్లాడుతున్న జెసి సూరజ్ ధనుంజయ్ గనోరే

జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే బుధవారం పొలంబాట పట్టారు. పల్నాడు జిల్లాలోని అచ్చంపేట మండలం, కోగంటివారి పాలెం పత్తి రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. పంటపొలాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పత్తి పొలాల్లో దిగుబడి, పంట కాస్తున్న తీరును చూసి రైతులు, మండల వ్యవసాయాధికారి తో మాట్లాడారు. పత్తి రైతుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపారు. ఆయన వెంట కోగంటి పాలెం వారి పత్తి రైతులు, మండల వ్యవసాయాధికారి, సత్తెనపల్లి ఆర్డీవో రమాకాంతరెడ్డి ఉన్నారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమం

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరు మండలంలోని పీసపాడు, పారుపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ నీరు నిలిచిన పొలాల్లో అధిక నీటిని తీసి వేయాలని, మొక్కలు చనిపోవడం గమనిస్తే కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బెన్డజిమ్ గ్రామును లీటర్ నీటికి వేర్లు తడిచేలా పోయాలని, ఎకరాకు 20 కిలోల నత్రజని, 10 కిలోల పొటాష్ ఎరువు వేసుకోవాలని సూచించారు. 1919 19 లేదా 13:0:45 మందును 10 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పైపాటుగా పిచికారీ చేయాలన్నారు. రైతులు అందరూ సామూహికంగా లింగాకర్షణ బుట్టలు ఎకరానికి 8 నుంచి 10 ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. పచ్చదోమ, తెల్లదోమ ఉధృతిని గమనిస్తే ఇమిడాక్లోప్రిడ్ 100 మిల్లీలీటరును ఎకరాకు లేదా థియామెథాక్సామ్ 80గ్రాములను ఎకరానికి పిచికారి చేసుకోవాలని సూచించారు.

ఈ వానతో పంటలకు నష్టం లేదు

మొంథా తుఫాన్ వర్షాల కారణంగా పంటలకు పెద్దగా నష్టం వాటిల్లలేని క్రోసూరు వ్యవసాయాధికారి వేణుగోపాల్ తెలిపారు. ప్రత్తి పంట 90 శాతం పూర్తయిందని, కంది, మిర్చి, వరి, మొక్కజొన్న, పండ్ల తోటలకు వర్షాలు చేటుచేయలేదని చెప్పారు. వర్షాలు తగ్గు ముఖం పట్టగానే పైర్లకు తప్పని సరిగా సూక్ష్మ పోషకాలు అందించాలని, తెగుళ్ల మందులు కూడా వాడాలని రైతులకు సూచించారు. ఏమైనా సమస్యలుంటే అధికారులను కలసి సలహాలు తీసుకోవాలని చెప్పారు.

కార్తిక పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి - వినుకొండ

పరమశివుడు కొలువైన అరుణాచలం క్షేత్రంలో పల్నాడు జిల్లా వాసుల ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. అరుణా చలేశ్వర అన్నదాన సేవా సమాజం ఆధ్వర్యంలో ప్రతినెలా పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. అన్నదాన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పారెళ్ళ మల్లికార్జున్ రావు, ఆరేపల్లి ఏడుకొండలు మాట్లాడుతూ కార్తీక మాసం కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని అన్నదాన సేవా సమాజం ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు అరుణాచల క్షేత్రంలో వేడుకలు నిర్వహించామని చెప్పారు. మూడవ రోజు దాదాపు 5వేల మంది భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లాకు చెందిన దాదాపు 100 భక్తులు అరుణాచాలంకు తరలివెళ్లారు. వీరితో పాటుగా కమిటీ ముఖ్యులు అన్నం నాగా సత్యనారాయణ, బొమ్మిన కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు వీరాంజనేయులు, లాయర్ శంకర్రావు, కొల్లిపురి వీరంజనేయులు, అరేపల్లి కృష్ణ, బాలకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

గురజాల : గురజాల మండలం దైద బిలంలో బుధవారం కార్తీక పౌర్ణమి పూజలలో గురజాల ఎమ్మెల్యే ఎరపతినేని శ్రీనివాస్ రావు పాల్గొన్నారు కృష్ణానది పక్కనే కొండలలో వెలసిన అమరలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న నూతన పాలకమండలి సభ్యులు

టెంపుల్ టూరిజం హబ్‌గా రాష్ట్రం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంతో పాటు, ఏపీని టెంపుల్ టూరిజానికి హబ్‌గా మార్చాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానోద్దేశ్యమని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుబుధవారం తెలిపారు. చిలకలూరిపేట మండలం బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన తొలుత స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సభ్యులు, ప్రజల నుద్దేశించి మాట్లాడారు. తిరుమల సహా పలు ప్రధాన ఆలయాలను కలుపుతూ ఆధ్యాత్మిక, పర్యాటక అనుభూతికి ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా నూతన ధర్మకర్తల మండలిని బద్ధత, అంకితభావంతో పని చేయాలన్నారు. జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, బీజేపీ నాయకులు మల్లెల శివ నాగేశ్వరరావు, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివ రావు, మార్కెట్‌యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మండల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయి బాబు, టీడీపీ నాయకులు అంబటి సోంబాబు, కోడె హనుమంతరావు, పూసల హరిబాబు, గుర్రం నాగపూర్ణ చంద్ర రావు, తెలుగుమహిళా, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మత్స్యకారుల కాలనీకి వేస్తున్న రోడ్డు

నూతన రోడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి - విజయపురిసౌత్

దశాబ్దాల కాలంగా అభివృద్ధికి నోచుకోని స్థానిక సాగర్ క్యాంపు మత్యకారుల కాలనీ రోడ్లకు ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి కృషితో మహర్దశ పట్టింది. ముళ్ళకంపలు, గోతులతో కూడిన ఈ గ్రావెల్ రహదారిని సీసీ రోడ్డుగా నిర్మించేందుకు బుధవారం ప్రాజెక్ట్ అధికారులు, కూటమి నేతలు భూమి పూజ నిర్వహించారు. అనంతరం జల వనరుల శాఖ ఈఈ రమేష్ మాట్లాడుతూ పర్యాటక ప్రాంతమైన నాగార్జున సాగర్ ప్రాజెక్టు కాలనీలో రహదారుల అభివృద్ధికి ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి చొరవతో రూ.5కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఇప్పటికే ఎయిర్ స్ట్రిప్, బయ్యారం రహదారిని రూ. 2.4 కోట్లతో నిర్మించినట్లు పేర్కొన్నారు. సాగర్ క్యాంపు, డౌన్ మార్కెట్‌లో సీసీ రోడ్లను రూ.2.6 కోట్లతో చేపడుతున్నట్లు తెలిపారు. గడిపూడి శ్రీనివాసరావు, డిఈ మురళీధర్, ఏఈ సుధాకర్, మత్యకారుల సంఘం అధ్యక్షుడు మైలపల్లి అప్పలరాజు, ఎరిపల్లి వెంకటేశ్వర్లు, సీహెచ్ అప్పలరాజు, ధనుం జయరావు, దేవుడు, నర్సింహులు పాల్గొన్నారు.

పూడికతీత పనులను ఎమ్మెల్యే పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఇటీవల తుఫాను ప్రభావంతో నరసరావుపేట పరిధిలోని ప్రధాన మురుగు కాలువలు చెత్తా చెదారంతో నిండిపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు స్పందించి మురుగు నీరు ప్రవాహానికి తీవ్రమైన అడ్డంకి ఏర్పడిన ప్రాంతాలలో మరమ్మత్తు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో సమస్య పరిష్కరించేందుకు మున్సిపాలిటీ ప్రత్యేక శుద్ధీకరణ డ్రైవ్‌ను చేపట్టింది. ఈ డ్రైవ్ కింద ట్రైన్లను (డ్రైన్లు) క్లీన్ చేయడానికి మున్సిపాలిటీ సిబ్బంది, మెషినరీతో కూడా మొత్తం పట్టణంలో విస్తతంగా పనులు చేపట్టారు. చెత్తా, చెదారాన్ని తొలగించడంతో పాటు, డ్రైన్ల ప్రవాహాన్ని మళ్లీ సాధారణ స్థితికి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పట్టణంలోని 10కి పైగా ప్రధాన మురుగు కాలువలు శుభ్రపరచడం జరిగిందని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది తెలిపారు. బుధవారం నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మేజర్ డ్రైన్ల శుద్ధీకరణ పనులను స్వయంగా పర్యవేక్షించారు. పట్టణంలోని కీలక ప్రాంతాలైన సత్తెనపల్లి మెయిన్ బజార్, పల్నాడు బస్టాండ్ వద్ద డ్రైన్ల పరిశీలించిన ఎమ్మెల్యే, మున్సిపాలిటీ సిబ్బందిని ప్రశంసించారు.

పలు వార్డులలో శంకుస్థాపనలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఆయా వార్డులలో వార్డు కౌన్సిలర్లతో కలసి బుధవారం మున్సిపల్ చైర్మన్ షేక్‌రఫాని శంకుస్థాపనలను చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పట్టణ అభివృద్ధిపై జరిపిన సమీక్షలలో కౌన్సిల్ సభ్యులు ప్రాధాన్యత క్రమంలో పార్టీల కతీతంగా అన్ని వార్డులలో అభివృద్ధి పనులు చేపట్టాలని చెప్పారు. అందులో భాగం గానే 37వ వార్డులో రూ.9.5 లక్షలతో డ్రైన్, 34వార్డులో రూ.8.7 లక్షలతో, 32వ వార్డులో రూ.16.0లక్షలతో రోడ్డు నిర్మాణం పనులకు శంకు స్థాపన చేసినట్లు చెప్పారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు పాములపాటి శివకుమారి, కోటనాయక్, రాజేంద్ర, టిడిపినాయకులు టి.శ్రీహరి, తొండెపు వెంకయ్య, రాములు నాయక్, చిన్ననాయక్ కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్ వజ్రగిరి జెస్టిస్‌కు రెండు పురస్కారాలు

ప్రజాశక్తి - వినుకొండ

ప్రముఖ చిత్రకారులు డాక్టర్ వజ్రగిరి జెస్టిస్‌కు ఒకే రోజు రెండు పురస్కారాలు లభించాయి.ఆంధ్రప్రదేశ్ ఆర్ట్ అసోసియేషన్ గిల్డ్ ఆధ్వర్యంలో విజయవాడ బాలోత్సవ భవన్ లో ఈనెల 3వ తేదీన నిర్వహించిన మన సంస్కృతి చిత్రకళా ప్రదర్శన, స్మృతి పురస్కారాలలో భాగంగా జస్టిస్ ఖండవల్లి శేషగిరిరావు స్మృతి పురస్కారం అందుకున్నారు. 'నాట్యమయూరిచిత్రానికి ప్రత్యేక పురస్కారాన్ని మాజీ మంత్రి వర్యులు మండలి బుద్ధప్రసాద్, ఆర్ట్ గిల్డ్ అధ్యక్షులు బి.ఎ.రెడ్డి, రాష్ట్ర సంస్కృత, తెలుగు అకాడమీ అధ్యక్షులు శరశ్చంద్ర, రాష్ట్ర క్రియేటివిటీ ఆర్ట్ అకాడమీ అధ్యక్షురాలు పొడ పాటి తేజస్విని, సుభాష్‌బాబు, డ్రీమ్ రమేష్ చేతుల మీదుగా అందుకున్నారు.

రేపు ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెదనందిపాడు

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) పూర్వ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి సహకారంతో ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పుస్తకాలను పెదనందిపాడు లోని తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో శాసన మండలి మాజీ సభ్యులు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్.లక్ష్మణరావు శుక్రవారం ఆవిష్కరిస్తారని విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. పెదనందిపాడు, కాకుమాను మండలాలలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ, ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్ పరీక్ష రాస్తున్న విద్యార్థులకు ఈ పుస్తకాలను ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ పుస్తక ప్రచురణకు నాట్స్ తరఫున నాగులపాడుకు చెందిన బాపయ్య చౌదరి సహకారం అందించారని తెలిపారు. కార్యక్రమంలో బాపయ్య చౌదరి తల్లిదండ్రులు నూతి సుబ్బారావు, సీతాదేవి, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం (గుంటూరు) మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు దాసరి శేషగిరిరావు, అర్వపల్లి కృష్ణ మూర్తి, మాజీ ఎమ్‌పిపి నర్రా బాలకృష్ణ , విద్యావేత్త ముద్దన రాఘవయ్య, పెదనందిపాడు, కాకుమాను మండలాల విధ్యాధికారులు పోపూరి జాకబ్, కె.ఎఫ్.కెనడీ, స్తానిక పి.ఎ.ఎస్. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం వీర రాఘవయ్య పాల్గొంటారని తెలిపారు.



రౌడీ షీటర్, కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సిఐ

రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి కౌన్సెలింగ్

ప్రజాశక్తి - తెనాలి

పట్టణ త్రీ టౌన్ పరిధిలోని రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి సిఐ ఎస్.సాంబశివరావు బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ముఖ్యంగా మూడు కంటే అధికంగా కేసులలో ఉన్న వారిని, పోలీసులు పిలిచినప్పుడు స్టేషన్‌కు హాజరుకాని రౌడీషీటర్లను గుర్తించి, వారిని హెచ్చరించారు. వారి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడారు. రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంటుందని, ప్రవర్తన మార్చుకోవాలని, ఎలాంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు. పిలిచినప్పుడు విధిగా స్టేషన్కు హాజరు కావాలని ఆదేశించారు. ఆయన వెంట ఎస్ఐలు ఎన్.ప్రకాశరావు, కరీముల్లా, సిబ్బంది ఉన్నారు.

మల్లేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దంపతులు

ప్రజాశక్తి - పెదకాకాని



సత్కరిస్తున్న ఉప కమిషనర్

ప్రముఖ శైవ క్షేత్రాలలో ఒకటైన పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు విచ్చేసి కార్తీక దీపాలు వెలిగించి స్వామివార్లను దర్శించు కున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవా దాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ హరి జవహర్ లాల్ దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ ఆలయ సిబ్బంది,అర్చకులతో సమన్వయం చేసి ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - కొల్లిపర

రాజకీయాలకు అతీతంగా మండల అభివృద్ధి పనుల్లో అందరూ భాగస్వామ్యం కావాలని ఎంపీపీ బి.పద్మావతి అన్నారు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గత ఏడాది ఉపాధి హామీ పనులకు పనులకు 2.34 కోట్ల నిధులు వినియోగించామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 119 పనులు గాను రు1.99 కోట్లు నిధులు ఆమోదం కోసం వేచి చూస్తున్నామన్నారు 15 ఆర్థిక సంఘం నిధులలో రూ 1.07 కోట్లు 36 తాగునీటి పంపులు మురుగు కాల్వల నిర్మాణం .67 కోట్లతో సిసి రోడ్లు నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కార్యదర్శులు అధికారులు పాల్గొన్నారు.



రైతులకు పొలంబడి కిట్లు అందజేస్తున్న అధికారి, అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ అధికారి

విషపూరిత పురుగుమందుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

విషపూరిత పురుగుమందులు ఉపయోగించేటప్పుడు మానవ శరీరంపై పురుగు మందుల ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆర్ విజయబాబు రైతులకు తెలిపారు. మండలంలోని చిలువూరు గ్రామంలో బుధవారం ఉత్తమ యాజమాన్య పద్ధతులు పొలంబడి కార్యక్రమంలో భాగంగా వరి పొలం పరిసరాల విశ్లేషణ అనే అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగు మందులు ఉపయోగించాలా వద్దా అనే అంశంపై మాట్లాడుతూ పురుగుమందులు ఉపయోగించినట్లయితే హానికర పురుగుమందుల ప్రభావం శరీరంపై పడకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డబ్బా మీద ఉండే ట్రయాంగిల్స్ పురుగు మందుల ప్రభావాన్ని తెలుపుతాయన్నారు. ఏ గుర్తు దేనికి సంకేతం అనేది రైతులకు తెలిపారు. ఎరుపు రంగు త్రికోణం ఉన్నట్లయితే చాలా విషపూరితమైన పురుగుమందని పసుపు రంగు త్రికోణం ఉంటే విషపూరితమే కానీ అంత ప్రమాదకరం కాదని తెలిపారు. బులుగు రంగు ట్రయాంగిల్ పై రెండిటితో పోల్చుకుంటే విష ప్రభావం మధ్యస్థంగా ఉంటుందని ఆకుపచ్చ ట్రయాంగిల్ విషపూరితం తక్కువ ఉంటుందన్నారు. గుర్తు ఏమైనాప్పటికీ రైతులు పురుగుమందులు ఉపయోగించేటప్పుడు ఖచ్చితమైన నియమాలు పాటించాలని దాని ప్రభావం శరీరం మీద పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పొలంబడి కిట్లను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలువూరు మాణిక్యం తెలుగుదేశం పార్టీ నాయకులు తోటకూర సీతారామయ్య విస్తరణ అధికారి ప్రజ్ఞాన్ వ్యవసాయ శాఖ సిబ్బంది ఎంపీఈఓ లు మరియు రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు వడ్డేశ్వరం జెడ్పీ విద్యార్థులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు

నవంబర్ మూడవ తేదీన ఉమ్మడి గుంటూరు జిల్లాల రగ్బీ అండర్ 14, అండర్ 17 బాల, బాలికల పోటీలు పెదకాకాని మండలం, వెనిగండ్లలో జరిగిన పోటీలలో ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప బుధవారం తెలిపారు. అండర్ 17 విభాగంలో ఎం.భువనేశ్వరి భాయి, డి.సాయిత, కె.ప్రియదుర్గ, ఎస్.శ్యామల, అండర్ 17 విభాగంలో బాలురు ఎస్.కె. బాజీ, అండర్ 14 విభాగంలో కె.పవన్‌నాయక్, దివ్య తదితరులు చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలలో పాల్గొంటారని జోజప్ప తెలిపారు. అండర్ 14 విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఎన్టీఆర్ జిల్లాలో జరిగే పోటీలలో క్రీడాకారులు పాల్గొంటారని అన్నారు. అండర్ 14 స్విమ్మింగ్ పోటీలలో ఎస్.కె నస్రిన్, నజీర్ విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే పోటీలలో పాల్గొంటారని వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలలో జరిగే బాలబాలికల క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన మెల్లెంపూడి రవి, నూతక్కి రవి, పి సతీష్ కుమార్ లను ఎస్ఎంసి ఛైర్మన్ ఎస్ కే బషీర, టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు, టిడిపి గ్రామ అధ్యక్షులు ఈ పూరి బాబు, మాజీ సర్పంచ్ ఎస్.కె.చిన్న , రంగా, షరీఫ్ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను, విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.

తుపాను బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మొంథా తుపాను ప్రభావిత కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ రూ.5లక్షల విలువచేసే నిత్యావసర వస్తువులను బుధవారం పంపిణీ చేసింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు వంశీ ధరదాస్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా త్లోవల్లూరు మండలం రొయ్యూరు గ్రామం, పరిసర లంక గ్రామాల్లోని తుఫాన్ బాధిత కుటుంబాలకు చేసినట్లు తెలిపారు. ప్రతి బాక్సులో రోజువారీ సరుకులు ఇద్దరు వ్యక్తులు 15 రోజులపాటు వినియోగించుకునేంత సరిపడా విధంగా సిద్ధం చేశామన్నారు. సహాయ కార్యక్రమానికి మద్దతు ఇచ్చిన అందరు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎప్పుడైనా, ఎక్కడైనా విపత్తు సంభవించినప్పుడు మానవ సేవలో ముందుండే సంస్థగా హరే కృష్ణ మూవ్‌మెంట్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు విలాస దాస్, పబ్లిక్ రిలేషన్స్ రఘునందన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రతివిద్యార్థి ఫస్ట్ ఎయిడ్, సిపిఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డిస్టిక్ కో ఆర్డినేటర్ ఎస్ జానీరసూల్ సూచించారు. బుధవారం స్థానిక నిర్మల ఫార్మసీ కళాశాల, మంగళగిరి పట్టణంలోని రత్నాలచెరువులో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం ఐదవ రోజు కార్యక్రమాలు బుధవారం "ప్రాణ రక్షణ నైపుణ్యాలు - మనందరి బాధ్యత" అనే ముఖ్య అంశంతో నిర్వహించారు. కార్యక్రమాన్ని జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రేఖా నరేష్ బాబు ఆధ్వర్యంలో జరిగింది. నిర్మల ఫార్మసీ కళాశాల యూజీ విభాగం హెచ్‌ఓడి డాక్టర్ ఎం.సుధీర్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించడానికి అవసరమైన ప్రాథమిక జ్ఞానం ప్రతి వ్యక్తికీ అవసరం అని అన్నారు. కళాశాల కార్యదర్శి & కరస్పాండెంట్ రెవ సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. పాముల రెడ్డి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ దీప్తి, నాన్సీ, స్టూడెంట్ కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



కొత్త చాంబర్‌లో ఛైర్‌పర్సన్, కమిషనర్

మార్కెట్ కాంప్లెక్స్‌లోకి ఛైర్‌పర్సన్ ఛాంబర్

ప్రజాశక్తి - తెనాలి

పురపాలక సంఘం నూతన భవన నిర్మాణానికి చురుగ్గా సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో మహాత్మా గాంధీ మున్సిపల్ మార్కెట్ భవనంలో సిబ్బంది చాంబర్స్ తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భవనం మూడవ అంతస్తులోకి మున్సిపల్ ఛైర్ పర్సన్ తాడిపోయిన రాధిక, కమిషనర్ బి.రాజ అప్పలనాయుడు, మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్ చాంబర్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాలు మార్కెట్ కాంప్లెక్స్‌లోకి తరలించారు. మిగిలిన విభాగాలు త్వరలోనే అక్కడికి చేరనున్నాయి. కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



మోటారు పనితీరును పరిశీలిస్తున్న కమిషనర్

లేక్ పార్క్‌ను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలోని చినరావూరు సత్యనారాయణ లేక్ పార్కును మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు బుధవారం పరిశీలించారు. పార్కులో చిన్నారులు, సందర్శకుల ఆహ్లాదం నిమిత్తం ఏర్పాటు చేసిన ఫౌంటైన్ పని విధానాన్ని పరిశీలించారు. వాటర్ లీకేజ్ ని అరికట్టాలని సూచించారు. చిన్నారులు ఆడుకునేందుకు కేటాయించిన ఆటస్థలం, అందులో ఆట వస్తువులు, వాటి పని విధానం తెలుసుకున్నారు. సందర్శకులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు మెరుగు పరచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పిఎఎస్ కాలేజీ ప్రిన్సిపల్ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు పి.ఏ.ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వీరరాఘవయ్య రచించిన 'ప్రాచీన భరత ఖండం నుండి ఆధునిక భారతదేశంగా ఒక సామ్రాజ్యాతీత చరిత్ర' పుస్తకాన్ని పెదనందిపాడు ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు, విశ్రాంత డిఎస్పి కాళహస్తి సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీ నర్రా బాల వెంకటరామకృష్ణ, అధ్యాపకులు చేతులు మీదుగా ఆవిష్కరించి, అభినందనలు తెలిపినారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.వీర రాఘవయ్య మాట్లాడుతూ ఈ పుస్తకం మన భారతదేశం యొక్క గొప్ప, సంక్లిష్టమైన ప్రయాణానికి ఒక సమగ్ర మార్గదర్శి అన్నారు. పుస్తకంలో 5,000 సంవత్సరాల నాటి భరతఖండం నేటి ఆధునిక భారతదేశంగా ఎలా రూపాంతరం చెందినదో తెలుసుకొనవచ్చన్నారు. కార్యక్ర మంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.ప్రతాప్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పాతూరి శ్రీనివాస్, అసోసియేట్ ప్రొఫెసర్ డి రాజేష్ కుమార్, ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడి గీతాలక్ష్మి, కెమిస్ట్రీ డిపార్ట్మెంట్ హెచ్‌ఓడి ఎల్ ఎస్ రెడ్డి, సివిక్స్ డిపార్ట్మెంట్ హెచ్‌ఓడి కె.శ్రీనివాసమూర్తి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ వర్సిటీ వీసీగా పావులూరి సుబ్బారావు

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీకి కొత్త చాన్స్‌లర్‌గా ప్రముఖ శాస్త్రవేత్త, అంతరిక్ష రంగంలో విశిష్ట సేవలందించిన డాక్టర్ పావులూరి సుబ్బారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ స్పేస్‌అకాడమీ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ ఎకనామిక్ కౌన్సిల్ సభ్యుడు వంటి పలు కీలక హోదాలలో ఉన్నారు. ఎపిలోని గోవాడ గ్రామానికి చెందిన ఆయన ఇస్రోలో 15 ఏళ్ల శాస్త్రవేత్తగా సేవలు అందించారు. 1993లో ఆయన స్థాపించిన అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంస్థ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు కీలక భాగస్వామిగా ఉండి, ఇప్పటివరకు 107 ఉపగ్రహాలు, 87 లాంచ్ వాహనాల తయారీ, సమీకరణ, పరీక్షలలో భాగస్వామ్యమైంది. భారత ప్రభుత్వంనుంచి భాస్కర అవార్డు సహా అనేక జాతీయ పురస్కారాలు అందుకున్నారు. 2023లో విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసి గౌరవించింది. చాన్స్‌లర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం డాక్టర్ పావులూరి సుబ్బారావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు కేవలం విద్యాపరమైనవిగా మాత్రమేకాక, పరిశ్రమాత్మక దృక్పథం కలిగినవిగా కూడా ఉండాలన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థాయికి చేర్చడం నాలక్ష్యంమని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, మాజీ డీజీపీ, వర్సిటీ అడ్వైజర్ డాక్టర్ మాలకొండయ్య, ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ డి.విజయరాము పాల్గొన్నారు.



డాక్టర్ సుబ్బారావును సత్కరిస్తున్న లావు రత్తయ్య తదితరులు

టేబుల్ టెన్నిస్‌లో విజేతగా ఆర్‌విఆర్ అండ్ జెసి

ప్రజాశక్తి-గుంటూరు

చెన్నైలో జరగనున్న సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో ఏఎన్‌యు జట్టు తరపున ఆడేందుకు తమ కళాశాల విద్యార్థులు ఎంపిక కావటం గర్వకారణం అని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని తెలిపారు. ఇటీవల ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ నిర్వహించిన అంతర కళాశాలల టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఆర్‌విఆర్ జట్టు విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకోవటంతోపాటు, ఈ పోటీల్లో ప్రతిభ చూపిన బి.రారాజు, ఎన్.నరసింహారావు, వి.విజయేంద్ర, పి.జి.ఎల్.కౌస్తుభ ఏఎన్‌యు జట్టులో స్థానం సంపాదించి, త్వరలో చెన్నైలో జరగనున్న సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విజేతలను బుధవారం కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, కళాశాల సిబ్బంది అభినందించారు. విజేతలను అభినందించిన వారిలో కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ పి.గౌరీశంకర్, డాక్టర్ ఎం.శివరామకృష్ణ తదితరులున్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సెక్రెటరీ, ప్రిన్సిపాల్

7న ఎన్జీరంగా సాహిత్య పురస్కార ప్రదానం

ప్రజాశక్తి-గుంటూరు

ఆచార్య ఎన్జీరంగా జయంతి వేడుకలు, ఎన్జీరంగా సాహిత్య పురస్కార ప్రధానం సభ ఈనెల ఈనెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం పద్మావతి కళ్యాణ వేదికపై నిర్వహిస్తున్నట్లు ఆచార్య ఎన్‌జి రంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు ఒక ప్రకటనలో తెలిపారు. 2025 సంవత్సరానికి మహిళల నుండి కథా సంపుటాలను ఆహ్వానించగా హైదరాబాద్‌కు చెందిన సి.యమునా రాసిన 'కరిగిపోని కలలు'కు సాహిత్య పురస్కారం, రూ.10వేలు నగదు, విశాఖపట్నంకు చెందిన పెబ్బల్లి హైమావతి రాసిన 'జీవితాన్ని ప్రేమించు' కథా సంపుటానికి రూ.5వేలు నగదుతో పాటు సాహిత్య పురస్కారాలు, సత్కారం అందజేయనున్నట్లు చెప్పారు. కావున నగరంలోని సాహితీవేత్తలు, రచయిలు హాజరు కావాలని కోరారు.

చలపతి కాలేజీలో ఎఐ, ఎంఎల్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో సిఎస్‌ఈ విభాగం, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండిఆ సంయుక్త ఆధ్వర్యంలో ద ఫ్యూచర్ ఆఫ్ టెక్ ఎఐ, ఎంఎల్ అనే అంశంపై ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహిం చారు. బోర్డ్‌వాక్ పైప్‌లైన్స్ సీనియర్ బిజినెస్ అనలిస్ట్ పి.గిరిధర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతికత దృష్ట్యా ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ రంగాలకు చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. భవిష్యత్‌లో ఈ సాంకేతికతను ఉపయోగించి, సవాళ్లను ఎలా పరిష్కరించాలో వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులలో ఎఐ అండ్ ఎంఎల్‌పై అవగాహన పెరిగిందని, అలాగే జనరేటివ్, ఏజెంటిక్ ఎఐని ఉపయోగించి, క్రియేటివ్ ఇకోసిస్టమ్‌ను భారతీయ భాషల పరంగా విస్తరింపచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్, సిఎస్‌ఇ విభాగాధిపతి డాక్టర్ ఎ.బాలజీ తదితరులు పాల్గొన్నారు.



గిరిధర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

విజ్ఞాన్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

మార్చి 1 నుండి పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

విజ్ఞాన్ యూనివర్సిటీ 2026-27 సంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సులకు వీశాట్ నోటిఫికేషన్ విడుదల అయ్యింది. బుధవారం యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషన్ చేతులమీదుగా నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ తాము బీటెక్‌లో అగ్రికల్చర్, బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మాటిక్స్, బయోమెడికల్, కెమికల్, సివిల్, సీఎస్‌ఈతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్‌సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, డేటాసైన్స్, ఐవోటీ, ఈసీఈ, ఈసీఈ-వీఎల్‌ఎస్‌ఐ, ఈఈఈ, ఫుడ్ టెక్నాలజీ, ఐటీ, మెకానికల్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, టెక్స్‌టైల్ టెక్నాలజీ, బీఫార్మసీ, ఫార్మా-డీ, ఎం.ఫార్మసీ, బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, డిప్లొమా (సీఎస్‌ఈ. ఈసీఈ, మెకానికల్, ఈఈఈ) కోర్సులను అందజేస్తున్నామని చెప్పారు. వీటితో పాటు బీఎస్సీ (సైకాలజీ), బీఎస్సీ (డేటా సైన్స్), బీఎస్సీ (మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్స్), బీఎస్సీ (ఆక్చూరియల్ సైన్స్), బీబీఏ, బీసీఏ, బీఏ (ఎల్‌ఎల్‌బీ), బీబీఏ (ఎల్‌ఎల్‌బీ), ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎంఏ ఇంగ్లీష్, ఎమ్మెస్సీ డేటాసైన్స్, ఎమ్మెస్సీ సైకాలజీ, పీహెచ్‌డీ కోర్సులను కూడా అందజేస్తున్నామని చెప్పారు. బీటెక్, బీఫార్మసీ, ఫార్మ్-డీ కోర్సులలో ప్రవేశాలకు దేశవ్యాప్తంగా చేపట్టనున్న వీశాట్ ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశం కలదన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీకి అను బంధంగా ప్రారంభించిన విజ్ఞాన్స్ యూనివర్సిటీ హైదరాబాద్ ఆఫ్ క్యాంపస్‌లో విద్యార్థులకు విభిన్న కోర్సులు అందుబాటులో ఉన్నట్లు వీసీ తెలిపారు. గుంటూరు బ్రాంచ్ వర్సిటీలో ఉండే బిటెక్ కోర్సులతోపాటు బికామ్, బీఎస్సీ (సైకాలజీ), ఎమ్మెస్సీ (సైకాలజీ), ఎమ్మెస్సీ (ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ), ఎంటెక్, పీహెచ్‌డీ (సీఎస్‌ఈ, ఈసీఈ, మేనేజ్‌మెంట్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయోటెక్నాలజీ, ఫార్మసీ) కోర్సులు అందజేస్తున్నామని పేర్కొన్నారు.మార్చి 1 నుండి ఏప్రిల్ 15 వరకూ ప్రవేశ పరీక్ష ఉంటుందని, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్టణం, ఏలూరు, రాజమండ్రిలోని అన్ని విజ్ఞాన్ సంస్థల కార్యాలయాల్లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని, https://admissions. vignan.ac.in అడ్మిషన్స్ డీన్ డాక్టర్ కె.వి. కృష్ణకిషోర్ తెలియజేశారు. ఎపి, తెలంగాణాతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ పరీక్ష నిర్వహిస్తా_మన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ డి.విజయరాము, డైరక్టర్ అడ్మిషన్స్ ఏ. గౌరిశంకర్ రావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఏ.గౌరి శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విశాట్ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న వీసీ

సమాజ హితులకు కౌండిన్య ఐఎఎస్ అకాడమీ సత్కారం

ప్రజాశక్తి-గుంటూరు

దశాబ్దాల కాలంగా సమాజంలో ఆరోగ్యం, ఆర్థిక, ఆధ్యాత్మిక రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న సమాజ హితులను కౌండిన్య ఐఎఎస్ అకాడమీ ఆధ్వర్యంలో సత్కరించారు. బుధవారం వెనిగళ్ల సమీపంలోని అకాడమీ ప్రాంగణంలో జరిగిన సభకు అకాడమీ వ్యవస్థాపకులు డాక్టర్ ఇ.వి. నారాయణ అధ్యక్షత వహించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ఇ.వి.నారాయణ నేతత్వంలో కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ రూ.2.50 కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లను ప్రతిభగల పేద విద్యార్థులకు అందించడం హర్షణీయమన్నారు. ఐదేళ్ల క్రితం ప్రారంభమైన కౌండిన్య ఐఏఎస్ అకాడమీ రూ.7 కోట్లకు పైగా దాతల నుండి విరాళాలను సేకరించి ప్రశాంత వాతావరణంలో నైపుణ్యాలను అభివృద్ధిపరిచి పేద ప్రతిభ గల విద్యార్థులకు పోటీ పరీక్షలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం అభినంద నీయమన్నారు. నారాయణ మాట్లాడుతూ కోట్లాది రూపాయలను విరాళంగా అందించి ప్రతిభ గల పేద విద్యార్థులకు తోడ్పాటును అందిస్తున్న దాతలందరికీ కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గత రెండు దశాబ్దాలకుపైగా గుంటూరు నగరంలో ఎస్.హెచ్.ఒ ద్వారా ఆరోగ్య సేవలను అందిస్తున్న, ఐఎంఎ నగర అధ్యక్షులుగా ఎంపికైన డాక్టర్ టి.సేవాకుమార్‌ను, డిఎస్పీగా పదోన్నతి పొందిన చిలకా చంద్రమౌళిని, వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి, ఆలయ చైర్మన్‌గా ప్రభుత్వంచే ఎంపిక చేయబడిన అనంత లక్ష్మీనారాయణను, యుక్త వయస్సులోనే అభయ హస్త ఫైనాన్షియల్ సర్వీసెస్‌ను ప్రారంభించిన ఆర్థిక సలహాలు అందిస్తున్న నాగ వెంకట శివప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో టిజెపిఎస్ కళాశాల విశ్రాంత ఆచార్యులు డాక్టర్ వి.సింగారావు, డాక్టర్ పోతురాజు శ్రీనివాసులు, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి.ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న వారితో డాక్టర్ నారాయణ, లక్ష్మణరెడ్డి

వాటర్‌షెడ్ మహోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు రూరల్, వెంగళాయపాలెంలో ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న వాటర్‌షెడ్ మహోత్సవం, మిషన్ వాటర్‌షెడ్ పునరుత్తాన్ ప్రారంభోత్సవ సభ ఏర్పాట్లను జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీవాస్తవ బుధవారం పరిశీలించారు. గ్రామంలోని వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపోనెంట్-పిఎంకెఎస్‌వై కార్యక్రమంలో భాగంగా అమృత్ సరోవర్ చెరువు అభివృద్ధి పనులను పరిశీలించి, త్వరలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం సభ జరిగే లయోలా స్కూల్‌ను సందర్శించి, అక్కడ సభకు వచ్చే వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో గుంటూరు వెస్ట్ తహశీల్దార్ వెంకటేశ్వర రావు, ఎంపిడిఒ బండి శ్రీనివాసరావు, డ్వామా అధికారులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలు ఇస్తున్న జాయింట్ కలెక్టర్

స్వచ్ఛతలో ప్రతి పౌరుడూ భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి-గుంటూరు

నగర స్వచ్ఛతలో ప్రతిపౌరుడి పాత్ర ఎంతో ముఖ్యమని, ప్రతి ఇంటి నుండి వచ్చే వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరుచేసి ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. బుధవారం కమిషనర్ రెడ్డిపాలెం, విజయపురి కాలనీ, అన్నపూర్ణ నగర్, హిమని నగర్, టెలికాంనగర్, రెడ్డిపాలెం, అరండల్‌పేట ప్రాంతాల్లో పారిశుధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ తొలుత రెడ్డిపాలెంలో స్థానికులతో మాట్లాడుతూ వ్యర్థాలను వేరుచేయడం ద్వారా రీసైక్లింగ్, కంపోస్టింగ్ వంటి పద్ధతులు సులభమవుతాయని, తద్వారా నగరంలో చెత్త నిల్వ సమస్యలు తగ్గుతాయన్నారు. ప్రజారోగ్య కార్మికులు కూడా తమకు కేటాయించిన మైక్రో ప్యాకెట్ల వారీగా అన్ని ఇళ్ల నుండి నూరు శాతం చెత్త సేకరణ చేయాలన్నారు. చెత్త సేకరణ విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని పర్యవేక్షణ మెరుగ్గా చేయాలని శానిటేషన్ కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లకు స్పష్టం చేశారు. అనంతరం అరండల్ పేట మెయిన్ రోడ్‌లో డ్రైన్ భవన వ్యర్థాలతో నిండి ఉండడం గమనించి తక్షణం తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను ఎం.బుక్ మేరకు పరిశీలించి, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా పనులు ప్రారంభం నుండి మెరుగైన పర్యవేక్షణ చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పనులు పూర్తైన వెంటనే నిర్దేశిత విధానంలో ఎం.బుక్ రికార్డ్ చేయాలన్నారు. పర్యటనలో డిఈఈ రమేష్, ఎస్ఎస్ లు ప్రసాద్, ఐజాక్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్